
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నల్లగొండ

3

శనివారం 21 డిసెంబరు 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 84

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.123	200	220
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.120	180	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 28.5 । కనిష్ఠం 18.0

• ఊతం



పందిళ్ల సాగుకు ప్రోత్సాహం

కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా సాగునీటి సౌకర్యం ఉన్న రైతులు పందిళ్ల సాగు చేసేందుకు ఆర్థికంగా చేయూత అందించాలని నిర్ణయించింది. పందిళ్ల సాగు కింద బీర, కాకర, సొర, దొండకాయ, చిక్కుడు, బీన్స్, తదితర కూరగాయలు సాగుచేయవచ్చు. వీటికి టమాట, ఉల్లిగడ్డలా ధరల్లో హెచ్చు తగ్గులు ఉండవు. ఎప్పుడూ నికరంగా ధర ఉంటుంది. దీంతో ఓ వైపు రైతులకు లాభంతోపాటు కూరగాయల కొరత ఏర్పడకుండా చూడాలన్నది ప్రభుత్వ ఉద్దేశం.

- (ఆంధ్రజ్యోతి,యాదాద్రి, నల్లగొండ)

- అర ఎకరాకు రూ.50వేలు ఆర్థిక సాయం
- ఒక్కో రైతుకు రెండున్నర ఎకరాల వరకు అవకాశం
- యాదాద్రి జిల్లాకు 35యూనిట్లకు రూ.17.50లక్షలు మంజూరు
- నల్లగొండ జిల్లాకు 90 యూనిట్లు మంజూరు
- ఉద్యాన పంటల సాగుపై ప్రభుత్వం దృష్టి
- రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

రాష్ట్రంలో కూరగాయల కొరత లేకుండా ఈ పంటల సాగు పెంచేలా ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ప్రస్తుతం మార్కెట్‌లో కూరగాయల ధరలు రోజురోజుకూ రెట్టింపు అవుతున్నాయి. దీంతో ప్రజలకు ఆర్థిక భారం పడుతున్నా రైతులకు మాత్రం ప్రయోజనం ఉండటం లేదు. కేవలం వ్యాపారులు మాత్రమే లాభాలు గడిస్తున్నారు. ధరల పెరుగుదలకు స్థానికంగా ఈ పంటలను సాగుచేయకుండా, ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవడమే ప్రధాన కారణమని ప్రభుత్వం గుర్తించింది. వరికి ప్రత్యామ్నాయంగా కూరగాయాలు, పండ్లు, పూల సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. యాదాద్రి జిల్లా హైదరాబాద్‌కు చేరువలో ఉన్నా ఇక్కడ ప్రధానంగా వరి, పత్తి, కంది, తదితర పంటలపైనే రైతులు దృష్టి సారిస్తున్నారు. ఈ ప్రాంత రైతుల దృష్టిని ఉద్యాన పంటల వైపు మళ్లించేందుకు ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. అందులో భాగంగా రైతులు పందిళ్లతో కూరగాయల సాగు చేపట్టేలా అర ఎకరానికి రూ.50 వేల వరకు ఆర్థికంగా సాయం అందించనుంది. ఈ నిధులత పందిళ్లకు రాతి స్తంభాలు(కడీలు), ఇనుప వైర్లు ఏర్పాటు చేసుకోవచ్చు. యాదాద్రి జిల్లాకు మొత్తం 35యూనిట్లకు ప్రభుత్వం రూ.17.50 లక్షలు మంజూరు చేసింది. నల్లగొండ జిల్లాకు 90యూనిట్లు మంజూరుచేసింది.ఒక్కో రైతు 5యూనిట్ల వరకు అంటే రెండున్నర ఎకరాల వరకు పందిళ్ల సాగు చేయవచ్చు. వీటి సాగుకు ముందుకొచ్చే రైతులు దరఖాస్తు చేసుకున్న వెంటనే వారి పంట భూమిని అధికారులు పరిశీలించి అనుమతి ఇచ్చాక ఉద్యానశాఖకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుంది. మరోవైపు ఆయిల్‌పాం సాగును కూడా ఈ ఏడాది 2వేల ఎకరాల వరకు సాగును పెంచేలా అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. యాదాద్రి జిల్లాలో ఇప్పటివరకు 3,500 ఎకరాల్లో ఆయిల్‌పాం సాగవుతోంది. వచ్చే ఏడాది నుంచి ఆయిల్‌పాం గెలల దిగుమతి రానుంది.

250 గ్రామాలు కూరగాయల సాగుకు దూరం

వానాకాలంతో పాటు యాసంగిలో జిల్లాలో మొత్తం 3.50లక్షల ఎకరాల్లో పలు రకాల పంటలు సాగవుతున్నాయి. జిల్లాలో 426 గ్రామపంచాయతీల్లో సుమారు 250 పంచాయతీల్లో అసలు కూరగాయల సాగే లేదు. జిల్లా నేలలు పలు రకాల కూరగాయలు సాగుకు అనుకూలమైనా రైతులు ఆసక్తి చూపడం లేదు. జిల్లా జనాభాకు ఏటా సుమారు 80వేల మెట్రిక్ టన్నుల కూరగాయలు అవసరం. కాగా, జిల్లాలో కేవలం 30వేల మెట్రిక్ టన్నులు కూరగాయలు మాత్రమే ఉత్పత్తి అవుతున్నాయి. ఏటా జిల్లాకు ఇతర ప్రాంతాల నుంచి 50వేల మెట్రిక్ టన్నులకు పైగా కూరగాయలు దిగుమతి..

- మిగతా 4వ పేజీలో...

పందిళ్ల సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు ప్రణాళిక



రైతులు కూరగాయలు సాగు చేసేందుకు అవకాశం ఉన్నప్పటికీ, చాలా గ్రామాల్లో సంప్రదాయ పంటలకే పరిమితమవుతున్నారు. జిల్లాలో పందిళ్ల సాగుపై ఆసక్తి ఉన్న రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. పందిళ్ల సాగు కోసం 35 యూనిట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. రైతులు పొలాల్లో అర ఎకరం వరకు సాగు చేస్తే రూ.50వేలు ఆర్థిక సాయం అందుతుంది. ఆయా మండలాల ప్రజల జనాభాకు అనుగుణంగా కూరగాయలు సాగుచేసేలా రైతులకు అవగాహన కల్పిస్తు న్నాం. కూరగాయల సాగుతో రైతులు ఆర్థికంగా మెరుగుపడతారు. జిల్లా వ్యాప్తంగా కూరగాయలతోపాటు పలు రకాల పండ్ల సాగును కూడా పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలో ఆయిల్‌పామ్ సాగుకు రైతులు ముందుకువస్తున్నారు. వారికి ప్రభుత్వంపరంగా వచ్చే సబ్సిడీలపై అవగాహన కల్పిస్తున్నాం.

- సుభాషిణీ, యాదాద్రి జిల్లా ఉద్యానశాఖ అధికారి

• ఘాతం



నూతన మెనూ మాతో కాదు

- ప్రస్తుత ధరలతో సాధ్యంకాని మెనూ
- ఒక్కో విద్యార్థికి కనీసం రోజుకు రూ.100కేటాయించాలని డిమాండ్
- కలెక్టర్లకు వినతిపత్రాలు
- ఉమ్మడి జిల్లాలో 273 సంక్షేమ హాస్టళ్లు

ప్రభుత్వ హాస్టళ్లలో వసతి పొందుతున్న విద్యార్థులకు పోషకాలతో కూడిన నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ప్రభుత్వం భావించింది. అందుకోసం ఇటీవల ప్రభుత్వం నూతన మెనూను ప్రకటించింది. అన్ని ప్రభుత్వ హాస్టళ్లలో ప్రతీ రోజు నూతన మెనూ అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అంతేగాక, సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు నూతన మెనూ అమలును హాస్టళ్లలో అట్టహాసంగా ప్రారంభించి విద్యార్థులతో కలిసి భోజనం చేసి ప్రారంభించారు. అయితే ప్రస్తుత ధరలతో ఈ మెనూ అమలు సాధ్యం కాదని వార్డెన్లు తేల్చి చెబుతున్నారు. దీంతో కొన్ని చోట్ల వార్డెన్లు పాత మెనూనే అమలు చేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి,సూర్యాపేట (కలెక్టరేట్)

ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న ధరలతో నూతన మెనూ అమలు చేయడం సాధ్యకాదని వార్డెన్లు చెబుతుండగా, ప్రభుత్వం నూతన మెనూ ప్రకటించినా, వాటి ధరలు, విద్యార్థులకు ఎన్ని గ్రాములు అందించాలో మాత్రం ప్రకటించలేదు. ఒక్కో విద్యార్థికి ఎన్ని గ్రాముల చికెన్, మటన్ అందించాలో మెనూలో లేదు. అంతేగాక నూతన మెనూ ప్రకారం ప్రతీ రోజు ఆరు నుంచి ఏడు రకాల కూరలు వడ్డించాలి. దీంతో పాటు ఉడకబెట్టిన కోడిగుడ్డు అందించాలి. ఇవన్నీ అమలు చేయాలంటే సాధ్యంకాదని వార్డెన్లు చెబుతున్నారు. మెనూ అమలుకు జిల్లా సంక్షేమాధికారులు ఒత్తిడి తేవడం భావ్యం కాదంటున్నారు. ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి కనీసం రోజుకు రూ.100 కేటాయిస్తేనే ప్రకటించిన మెనూ అమలు చేయడం సాధ్యమవుతుందంటున్నారు. దీంతో వార్డెన్లు ఆయా జిల్లాల కలెక్టర్లకు ఇప్పటికే వినతి పత్రాలు కూడా అందజేశారు. ఈ విషయంలో ప్రభుత్వం స్పందించి స్పష్టత ఇస్తేనే విద్యార్థులకు పోషకాలతో కూడిన నాణ్యమైన ఆహారం అందే అవకాశం ఉంది.

ధరలు, గ్రాముల వివరాలు ప్రకటించాలంటున్న వార్డెన్లు

నూతన మెనూ అమలు చేయాలంటే ముందుగా ఆహార పదార్థాల ధరలు, ఒక్కో విద్యార్థికి ప్రతి రోజు ఆహారంలో అందించాల్సిన కూరలు, వాటి పరిమాణాన్ని ప్రకటించాలంటున్నారు వార్డెన్లు. అప్పుడే విద్యార్థుల సంఖ్యను బట్టి నూతన మెనూ అమలు చేయడం సాధ్యం అవుతుంది. ప్రస్తుతం మూడో తరగతి నుంచి ఏడో తరగతి విద్యార్థులకు నెలకు రూ.1330, 8వ తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు నెలకు రూ.1540, ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్థులకు నెలకు రూ.2100 ప్రభుత్వం డైట్ చార్జీగా ఇస్తోంది. అయితే విద్యార్థులకు రోజూ ఉదయం ఏదో ఒక టిఫిన్, మధ్యాహ్నం అన్నం, పప్పు, సాంబారు మాత్రమే ఇస్తున్నారు. రాత్రి సమయంలో అన్నం, ఏదైనా కాయగూరలతో కూర, మజ్జిగతో పాటు వారంలో ఐదు రోజులు కోడిగుడ్డు అమలు చేస్తున్నారు. కానీ, నూతన మెనూలో రోజుకు ఆరు నుంచి ఏడు రకాల కూరలు వడ్డించాల్సి ఉంది.

ఉమ్మడి జిల్లాలో 273 ప్రభుత్వ హాస్టళ్లు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖలకు చెందిన హాస్టళ్లు మొత్తం 273 ఉన్నాయి. ఈ హాస్టళ్లలో మొత్తం 23వేల మందికి పైగా విద్యార్థులు వసతి పొందుతున్నారు. అందులో సూర్యాపేట జిల్లా పరిధిలో 81 హాస్టళ్లు ఉన్నాయి. ఎస్సీ హాస్టళ్లు 36 ఉండగా, ప్రీమెట్రిక్ హాస్టళ్లు 30, పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లు ఆరు ఉన్నాయి. ఈ హాస్టళ్లలో సుమారు 2,900 మంది విద్యార్థులు వసతి పొందున్నారు. అదే విధంగా బీసీ హాస్టళ్లు 24 ఉన్నాయి. అందులో ప్రీమెట్రిక్ హాస్టళ్లు 15, పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లు 9 ఉన్నాయి. ఈ హాస్టళ్లలో...

- మిగతా 5వ పేజీలో...

రూ.100 కేటాయిస్తేనే

ప్రభుత్వ హాస్టళ్లలోని విద్యార్థులకు ప్రభుత్వం ప్రకటించిన నూతన మెనూ పక్కాగా అమలు చేయాలంటే ఒక్కో విద్యార్థికి రూ.100 కేటాయించాలని వార్డెన్లు పేర్కొంటున్నారు. ప్రస్తుతం నిత్యావసర వస్తువులతో పాటు, కూరగాయల ధరలు భారీగా పెరిగాయి. దీంతో ధరలను దృష్టిలో పెట్టుకుని మెనూ సిద్ధం చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం నూతన మెనూ ప్రకటించక ముందే ఆయా సంక్షేమశాఖల కమిషనర్లు కొత్త మెనూ సిద్ధం చేశారు. దాన్ని అమలు చేయాలంటేనే ఇబ్బందులు పడుతున్నామని, నూతన మెనూ మరింత ఇబ్బందికరంగా ఉందని వార్డెన్లు వాపోతున్నారు.

ఆసుపత్రి పనులు త్వరగా ప్రారంభించాలి

కలెక్టర్ ఇలాత్రిపాఠి



ఆసుపత్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి

నల్లగొండ టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో చేపట్టనున్న కొత్త బ్లాక్ నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిని ఆమె తనిఖీచేసి నూతన బ్లాక్‌ల నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వ మెడికల్ కళాశాల ఇటీవల నూతన భవనంలోకి మారగా, గతంలో నిర్వహించిన ఓపీ బ్లాక్‌ను పూర్తిగా తీసివేసి, ఇక్కడ నూతన భవనం నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.32కోట్లు విడుదల చేసిందన్నారు. అందులో భాగంగా తక్షణమే మెడికల్ కళాశాల సామగ్రిని నూతన భవనానికి తరలించాలని, నూతన బ్లాక్ కోసం గోడను నిర్మించి రోగులకు ఇబ్బంది కలగకుండా పనులు ప్రారంభించాలని సూచించారు. అలాగే నిర్మాణంలో ఉన్న క్రిటికల్ కేర్ విభాగాన్ని రెండు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఆమె వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణకుమారి, టీఎస్ఎంఐడీసీ ఈఈ జైపాల్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

సర్వే సిబ్బందికి అందుబాటులో ఉండాలి

ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు దరఖాస్తు చేసుకున్న వారు సర్వే బృందాలు వచ్చినప్పుడు అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. ఈ నెల 31 వరకు ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల సర్వే ఉంటుందన్నారు. ప్రతీ దరఖాస్తుదారు సర్వే బృందాలకు అందుబాటులో ఉండి వారి ఫొటో సహా ఇంటికి సంబంధించిన డాక్యుమెంట్లు, ఇతర వివరాలు సమర్పించాలన్నారు. ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినవారు ఉంటే వాట్సప్ ద్వారా కూడా సమాచారాన్ని అందజేయవచ్చన్నారు. సిబ్బంది యాప్‌లో వివరాలను జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు. దేవరకొండ, మిర్యాలగూడ, చండూరు తదితర డివిజన్‌లో సర్వే నెమ్మదించిందని, వెంటనే వేగవంతం చేయాలన్నారు. సర్వే పూర్తయ్యేంతవరకు పంచాయతీ కార్యదర్శులకు ఎలాంటి సెలవు మంజూరు చేయవద్దన్నారు. అనారోగ్య సమస్య ఉంటే ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ నారాయణ్‌అమిత్, ఆర్డీవోలు రమణారెడ్డి, శ్రీదేవి, గృహనిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను పరిష్కరించాలి

ఎస్పీ శరత్‌చంద్ర పవార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ కేసులు లేకుండా సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన నేర సమీక్షలో ఆయన మాట్లాడారు. పెండింగ్ కేసులను పూర్తి పారదర్శకంగా విచారించాలన్నారు. కేసు నమోదు నుంచి చార్జిషీట్ వరకు ప్రతీ విషయాన్ని కూలంకుషంగా విచారించాలన్నారు. పోక్సో కేసుల్లో త్వరితగతిన విచారన పూర్తిచేసి చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. అవసరమైతే సంబంధిత న్యాయమూర్తులను కలిసి కేసుల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. కొత్త కేసులతో పా టు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను ఎప్పటికప్పుడు సమీక్షించి వా టి సంఖ్య తగ్గే దిశగా అన్ని స్థాయిల అధికారులు పని చేయాలన్నారు. సాంకేతి క పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉండి సమర్థవంతమైన సేవలు అందించాలన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. సైబర్ క్రైం, డయల్ 100, ట్రాఫిక్ ని బంధనలు, తదితర విషయాలపై విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. విజబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి రోజూ డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించాలన్నారు. గంజాయి, పీడీఎస్ బియ్యం రవాణాతోపాటు చట్టవ్యతిరేక కార్యకలాపాలపై దృష్టిపెట్టి వాటిని అరికట్టేందుకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీ రాములునాయక్, డీఎస్పీలు, సీఐలు, తదితరులు పాల్గొన్నారు.

సోలార్ బ్యాటరీలతో ఆదాయం



సహాయక సంఘాల మహిళలకు చెక్కు పంపిణీ చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కలెక్టర్ ఇలాత్రిపాఠి, చిత్రంలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్

- మహిళలు సద్వినియోగం చేసుకోవాలి
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మొదటి సారిగా పైలట్ ప్రాజెక్టుగా మహిళా సంఘాలకు సోలార్ బ్యాటరీలు అందజేస్తున్నామని, దీంతో ఆదాయం కలుగుతుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కట్టంగూరు మండలం అయిటిపాముల గ్రామానికి చెందిన 50 మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా సోలార్ బ్యాటరీల ఏర్పాటుకు రూ.50లక్షల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మహిళలకు ఇందిరా మహిళ స్వశక్తి కింద ఒక్కొక్కరికి రూ.లక్ష విలువ చేసే సోలార్ బ్యాటరీలు 50మందికి అందజేస్తున్నామన్నారు. భూమి లేని నిరుపేద కుటుంబాలకు తోడుగా ఉండేందుకు నెలకు రూ.3వేల నుంచి రూ.4వేల వరక ఆదాయం వచ్చేలా స్వబ్యాగ్స్ ల్యాబ్ సహకారంతో సోలార్ బ్యాటరీ ఎనర్జీ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా ఇలాంటి కార్యక్రమాన్ని జిల్లాలో చేపట్టామన్నారు. మహిళలు సోలార్ బ్యాటరీల కోసం అదనపు పని చేయాల్సిన అవసరం లేదని, వారి పని వారు చూసుకుంటూనే ఆదాయం పొందవచ్చని తెలిపారు. స్వబ్యాగ్స్ ల్యాబ్ ఈ బ్యాటరీలను మహిళల ఇంటి దగ్గరి చేరుస్తుందని, బ్యాటరీ చార్జింగ్ కంపెనీ అనంతరం ప్రతినిధులు వచ్చి తీసుకువెళ్తారని, ఒక యూనిట్ పవర్‌కు రూ.16 కంపెనీ చెల్లిస్తుందన్నారు. పైలట్ పద్ధతిన ప్రారంభించిన ఈ ప్రాజెక్టు విజయవంతమైతే రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో కూడా అమలుచేస్తామన్నారు. కలెక్టర్ ఇలాత్రిపాఠీ మాట్లాడుతూ, ఇప్పటి వరకు తెలంగాణలో ఏ జిల్లాలో లేని విధంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామని, ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50 మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు సోలార్ ఎనర్జీ బ్యాటరీలు ఇస్తున్నామన్నారు. ఒక బ్యాటరీకి 2,000 లైఫ్ సైకిల్స్ ఉంటాయని, ఒకసారి బ్యాటరీని 2,000 సార్లు చార్జింగ్ చేసుకోవచ్చన్నారు. అందుకు సరిపడా పరికరాలను స్వబ్యాగ్స్ ల్యాబ్ కంపెనీ అందజేస్తుందన్నారు. ఈ ప్రాజెక్టు నిర్వహణకు సహకరించేందుకు జిల్లా యంత్రాంగం తరపున జిల్లా పరిశ్రమలశాఖ మేనేజర్‌ను, వ్యవసాయశాఖ జేడీఏను నోడల్ అధికారులుగా నియమించినట్లు తెలిపారు. స్వబ్యాగ్స్ ల్యాబ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సీఈవో సుధాకర్ మాట్లాడుతూ, రైతులకు, గ్రామీణ ప్రాంత మహిళలకు సేవలందించేందుకు 2021లో స్వబ్యాగ్స్ ల్యాబ్ స్టారప్ ఏర్పాటు చేశామని, ప్రతీక్ ఫౌండేషన్ సహకారంతో మహిళలతో సోలార్ బ్యాటరీ రెన్యువబుల్ ఎనర్జీని యూనిట్లు ఏర్పాటుచేస్తున్నామన్నారు. సత్య సోలార్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ జక్కుల సత్యనారాయణ మాట్లాడుతూ సోలార్ ఎనర్జీకి చాలా భవిష్యత్తు ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్, జిల్లా పరిశ్రమల మేనేజర్ కోటేశ్వర్‌రావు, హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, ఆర్డీవో అశోక్‌రెడ్డి, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మార్చిలోగా కాల్వల పనులు పూర్తి చేయాలి

ఉదయసముద్రం-బ్రాహ్మణవెల్లెంల ఎత్తిపోతల పథకం కాల్వల పనులు మార్చిలోగా పూర్తిచేసి చెరువులన్నింటినీ నీటితో నింపి 50వేల ఎకరాలకు సాగునీరు అందించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ ఇలాత్రిపాఠితో కలిసి ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కాల్వ పనులకు సంబంధించిన భూసేకరణకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రూ.37కోట్లు మంజూరు చేసిందన్నారు. మరో రూ.35కోట్లు వారం రోజుల్లో విడుదల చేయనుందని, అధికారులు కాల్వ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో అశోక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసిన మంత్రి

కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ఎన్జీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో మంత్రి కోమటిరెడ్డి స్వయంగా రక్తదానం చేశారు. ఆయనతోపాటు పలువురు యువకులు ఉత్సాహంగా ముందుకువచ్చి రక్తదానం చేశారు. అదేవిధంగా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు కాంగ్రెస్ నాయకులు పండ్లు పంపిణీ చేశారు.



రక్తదానం చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ స్పోర్ట్స్): క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎన్జీ కళాశాల మైదానంలో ఎన్‌పీఎల్ క్రికెట్ మ్యాచ్ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 20 రోజులుగా ప్రతీక్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్‌పీఎల్ క్రికెట్ మ్యాచ్ నిర్వహించామన్నారు. విద్యార్థులు, యువకులు క్రీడలపై ఆసక్తి పెంచుకొని ఆటల్లో రాణిస్తే భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఇలాత్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

కేటీఆర్‌పై కేసు కాంగ్రెస్ కుట్ర

బీఆర్ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి రావుల శ్రీధర్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి, పాల్గొన్న కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కేటీఆర్‌ను జైలులో పెట్టడమే టార్గెట్‌గా ఏడాది కాలంగా ము ఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుట్రలు చేస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి రావుల శ్రీధర్‌రెడ్డి విమర్శించారు. శుక్రవా రం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డితో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రతీ నిత్యం కేటీఆర్ ను అరెస్టు చేస్తామని, జైలులో పెడతామని బెదిరిస్తున్నారన్నారు. ఏడాది కాలంగా ప్రశ్నించే ప్రతి నాయకుడిపై, సోషల్ మీడియా ప్రతినిధులపై కేసులు పెట్టడమే సీఎం పనిగా ఉందన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని ప్రభుత్వంపై కేటీఆర్ పోరాడుతుండటాన్ని సీఎం సహించలేక పోతున్నారన్నారు. సాంకేతికంగా ప్రభుత్వం కేసులు పెట్టినా, విషయాన్ని మాత్రం ప్రజలు గమనిస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. రూ.55కోట్లతో కేటీఆర్ ప్రత్యేక చొరవ తీసుకొని ఫార్ములా రేసును రాష్ట్రానికి తీసుకువచ్చారని, ఇందులో కేంద్ర మంత్రులంతా పాల్గొన్నారన్నారు. దీనిపై రేవంత్ సర్కార్ తప్పుడు ప్రచారం చేస్తోందని, అవినీతి అంటూ గగ్గోలు పెడుతోందన్నారు. కాంగ్రెస్ ఎన్ని ఇబ్బందులు పెట్టినా ప్రజల కోసం బీఆర్ఎస్ పోరాటం ఆగదన్నారు. సమావేశంలో నాయకులు రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, కటికం సత్తయ్యగౌడ్, నిరంజన్‌వలీ, మాలే శరణ్యరెడ్డి, కొండూరు సత్యనారాయణ, బోనగిరి దేవేందర్, దేప వెంకట్‌రెడ్డి, అయితగోని యాదయ్య, మారగోని గణేష్, తుమ్మల లింగస్వామి, రావుల శ్రీనివాస్‌రెడ్డి, పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిలదీసినందుకే కేసు

(ఆంధ్రజ్యోతి, దేవరకొండ): ప్రజా సమస్యలపై నిలదీసినందుకే మాజీ మంత్రి కేటీఆర్‌పై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. శుక్రవారం దేవరకొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలపై నిలదీసినందుకు కేటీఆర్‌పై చిల్లర కేసులు పెడుతోందని విమర్శించారు. సమావేశంలో నాయకులు గాజుల ఆంజనేయులు, టీవీఎన్.రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, వేముల రాజు, లోహిత్‌రెడ్డి, జానీ బాబు, బొడ్డుపల్లి కృష్ణ, గుండాల వెంకట్, పాల్గొన్నారు.

రాళ్ల కుప్పపైకి దూసుకెళ్లిన ప్రైవేట్ బస్

● స్వల్పగాయాలతో బయటపడిన ప్రయాణికులు
● నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పరిధిలో ఘటన



ప్రమాదంలో దెబ్బతిన్న బస్సు

మిర్యాలగూడ అర్బన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఒంగోలు డిపో నుంచి హైదరాబాద్‌కు బయలుదేరిన కావేరి ట్రావెల్ ప్రైవేట్ బస్సు అదుపుతప్పి బోల్తాపడింది. గురువారరం అర్ధరాత్రి దాటిన తర్వాత నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణ పరిధిలోని నందిపాడు చౌరస్తా వద్ద ఈ ప్రమాదం జరిగింది. బస్సులోని ప్రయాణికులు, టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒంగోలు డిపో నుంచి ఎన్‌ఎల్ 01బీ 3017 సుమారు రాత్రి 11:45 నిమిషాలకు హైదరాబాద్‌కు 35మంది ప్రయాణికులతో బయలుదేరింది. మార్గంమధ్యలో నందిపాడు చౌరస్తా వద్దకు చేరుకుంటున్న సందర్భంలో బస్సు డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకున్నాడు. దీంతో వేగంగా వస్తున్న ట్రావెల్‌బస్సు రోడ్డుపక్కనే ఉన్న రాళ్లకుప్పపైకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ ఘటనలో బస్సులో ఉన్న 11మంది ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. ప్రమాదంలో గాయపడిన వారిలో ఒంగోలుకు చెందిన అంజిబాబు, సునీత, రాజేష్, పాండు, నర్సరావుపేటకు చెందిన శారద, సిరి, శ్రీనివాసరావు, సుబ్బారావు. గోపి, రాంచరణ్, హైదరాబాద్‌కు చెందిన శివలక్ష్మి ఉన్నారు. క్షతగాత్రులను స్థానిక మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం ట్రావెల్ బస్సు యాజమాన్యం మరో వాహనంలో క్షతగాత్రులను స్వస్థలాలకు తీసుకెళ్లింది. కాగా ఈ సంఘటనకు సంబంధించి శుక్రవారం రాత్రి వరకు తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని మిర్యాలగూడ టూటౌన్ సీఐ నాగార్జున తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం


ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైన ఇంటి సామగ్రి, పాక్షికంగా కాలిపోయిన నగదు



మిర్యాలగూడ అర్బన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): షార్ట్‌సర్క్యూట్‌తో పూరిల్లు పూర్తిగా దగ్ధమైన ఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని గాంధీనగర్‌లో శుక్రవారం జరిగింది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాలనీకి చెందిన దాసరి సతీష్ పైయింట్ వర్కర్‌గా పనిచేస్తుండగా, ఆయన భార్య స్వప్న ఇళ్లల్లో పనిచేస్తూ జీవనం సాగిస్తోంది. తమ ఇద్దరు పిల్లలు పాఠశాలకు వెళ్లగా, దంపతులిద్దరూ ఇంటికి తాళం వేసి తమ పనులకు వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో గృహవిద్యుత్ తీగలు షాక్‌సర్క్యూట్ కాగా, మంటలు చెలరేగి పూరిల్లు పైకప్పును అంటుకోగా మంటలు వ్యాపించి ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో స్వప్న ఇటీవల సమభావన సంఘం నుంచి అప్పుగా తీసుకున్న రూ.లక్ష, 20తులాల వెండి, మూడు తులాల బంగారు ఆభరణాలతోపాటు టీవీ, ఫ్రిజ్, వాషింగ్‌మిషన్, బీరువాతోపాటు ఇంట్లోని సామగ్రి, దుస్తులు పూర్తిగా దగ్ధమయ్యాయి. దీంతో బాధిత కుటుంబానికి కట్టుబట్టలు మాత్రమే మిగలగా, సుమారు 5.50లక్షల ఆస్తినష్టం జరిగినట్లు బాధిత కుటుంబం బోరుమంది. విషయం తెలుసుకున్న అగ్నిమాపకశాఖ ఎస్‌ఐ యాదగిరి తన సిబ్బందితో కలివచ్చి మంటలను అదుపుచేశారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ టి.రామకృష్ణ సంఘటన స్థలాన్ని పరిశీలించి బాధితుల నుంచి ఆస్తి నష్టం వివరాలు స్వీకరించారు. నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రభుత్వపరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంతోపాటు రూ.10లక్షల నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరుతూ సబ్ కలెక్టర్, తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. స్పందించిన సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ బాధిత కుటుంబానికి రూ.25వేల ఆర్థికసాయం అందజేశారు.

బైక్‌ల చోరీ ముఠా అరెస్ట్


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గిరిబాబు

కొండమల్లేపల్లి, డిసెంబరు (ఆంధ్రజ్యోతి) 12: నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో బైక్‌ల చోరీ ముఠా సభ్యులు నలుగురిని అరెస్ట్ చేసినట్లు దేవరకొండ డీఎస్పీ గిరిబాబు తెలిపారు. శుక్రవారం ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఇటీవల దేవరకొండ, కొండమల్లేపల్లి, చింతపల్లి, డిండి మండలాల పరిధిలో బైకులు చోరీకి గురి కావడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. ఈ క్రమంలోనే కొండమల్లేపల్లి చౌరస్తా వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న చింతపల్లి మండల కేంద్రానికి చెందిన భక్తోజు శివ అలియాస్ లడ్డూ, గౌతమ్ అలియాస్ చింటూ, వరికుప్పల అశోక్, సురకారపు శివ అలియాస్ కరీంలు అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. వారి నుంచి రూ.10లక్షల విలువైన 17 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసును చేధించడంలో కీలక పాత్ర పోషించిన కొండమల్లేపల్లి సీఐ ధనుంజయ, ఎస్‌ఐలు రామ్మూర్తి, నర్సింహులు, క్రైమ్ సిబ్బంది హేమూనాయక్, భాస్కర్, వెంకటేశ్, శేఖర్‌రెడ్డి, హోంగార్డు లక్ష్మయ్య, రమేష్‌లకు ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి రివార్డులు అందజేసినట్లు డీఎస్పీ గిరిబాబు తెలిపారు.

జూనియర్ అసిస్టెంట్‌పై చేయి చేసుకున్న గిర్దావర్

మునుగోడు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ గిర్దావర్ తన సహచర ఉద్యోగి అయిన ఓ జూనియర్ అసిస్టెంట్‌పై చేయి చేసుకున్న ఘటన నల్లగొండ జిల్లా మునుగోడు తహసీల్ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. టప్పా విషయంలో జూనియర్ అసిస్టెంట్‌తో గొడవపడిన గిర్దావర్ ఆగ్రహంతో జూనియర్ అసిస్టెంట్‌పై చేయి చేసుకోగా పక్కనే ఉన్న తోటి ఉద్యోగులు వారిని వారించినట్లు తెలిసింది. అరుపులు విన్న తహసీల్దార్ నరేందర్ వెంటనే తన ఛాంబర్ నుంచి వచ్చి విషయం తెలుసుకొని ఇరువురిపై ఆగ్రహం వ్యక్తం చేసి, సముదాయించారు. కాగా తనపై చేయి చేసుకున్న విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని జూనియర్ అసిస్టెంట్ తహసీల్దార్‌తో అన్నట్లు సమాచారం. కొద్దిసేపటికే కార్యాలయ సమయం ముగియటంతో విధులు ముగించుకొని ఎవరికి వారు తమ ఇంటిబాట పట్టారు. గొడవ విషయం తెలుసుకున్న ఆర్డీవో శ్రీదేవి ఆగ్రహం వ్యక్తం చేశారని పలువురు అధికారులు తెలిపారు. ఈవిషయం పై తహసీల్దార్‌ను వివరణ కోరగా గొడవ పడిన విషయం వాస్తవమేనన్నారు.

రేపు ఉమ్మడి జిల్లా సీనియర్ ఖోఖో జట్ల ఎంపిక

దామరచర్ల, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఈ నెల 22న మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో ఉమ్మడి నల్లగొండ జిల్లా సీనియర్ ఖోఖో జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాతి కృష్ణమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు తమ ఒరిజినల్ ఆధార్‌కార్డు, జీరాక్స్ కాపీలతో హాజరుకావాలని, ఈ నెల 22 ఉదయం 9గంటలలోపు టీటీడబ్ల్యూఆర్ఎస్ బాలుర కళాశాలలో నూకల నాగేశ్వర్‌రావు, ఖోఖో కోచ్ డి.స్వాతిలకు రిపోర్ట్ చేయాలన్నారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు వచ్చేనెల 8, 9, 10 తేదీల్లో వరంగల్ జిల్లా గీసుకొండలో జరిగే 57వ సీనియర్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఇతర వివరాలకు నాతి కృష్ణమూర్తి సెల్: 9866368843, ఎన్.నాగేశ్వర్‌రావు సెల్:6300085314, డి.స్వాతి సెల్: 9912754498లను సంప్రదించాలన్నారు.

పేటకు కేంద్రీయ విద్యాలయం

● కేబినెట్ సమావేశంలో ప్రకటన చేసిన కేంద్ర ప్రభుత్వం ● హర్షంవ్యక్తం చేస్తున్న జిల్లా ప్రజలు, విద్యార్థులు ● రానున్న విద్యాసంవత్సరం నుంచే అడ్మిషన్లు ప్రారంభం



సూర్యాపేట సిటీ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లాలోని పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందనుంది. ఇటీవల ఢిల్లీలో జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో సూర్యాపేట జిల్లాకు కేంద్రీయ విద్యాలయాన్ని మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. గతంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మిర్యాలగూడకు కేంద్రీయ విద్యాలయం మాత్రమే మంజూరైంది. ఆవిద్యాలయం జిల్లాకేంద్రంలో ఉంటే బాగుంటుందని అప్పటి నాయకులు నల్లగొండలో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం నల్లగొండ జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ రోడ్డులో కేంద్రీయ విద్యాలయం కొనసాగుతుంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు ఒకే కేంద్రీయ విద్యాలయం ఉండటం, అడ్మిషన్లలో తీవ్రపోటీ ఉండటంతోపాటు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఆర్మీ, రైల్వే ఉద్యోగుల పిల్లలకు మాత్రమే కేంద్రీయ విద్యాలయంలో ఎక్కువ అడ్మిషన్లు ఉండటంతో కేంద్రీయ విద్యాలయంలో అడ్మిషన్లు దొరికేవి కాదు. దీంతో కేంద్రీయ విద్యాలయంలో విద్య పేద విద్యార్థులకు అందని ద్రాక్షగా తయారైంది. తాజాగా సూర్యాపేట జిల్లాకు కూడా కేంద్రీయ విద్యాలయం మంజూరు కావడంతో పేద విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నెరవేరనున్న జిల్లా ప్రజల కల

సూర్యాపేట జిల్లాకు ఒక కేంద్రీయ విద్యాలయం ఉండాలనేది జిల్లా ప్రజల చిరకాల వాంఛ. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే ఉద్దేశంతో కేంద్రప్రభుత్వం సూర్యాపేట జిల్లాకు ఒక కేంద్రీయ విద్యాలయాన్ని మంజూరు చేస్తున్నట్లు ఇటీవల కేంద్ర విద్యాశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు. దీంతో కేంద్రీయ విద్యాలయాల్లో తమ పిల్లలకు ఉన్నత విద అందించాలనే తల్లిదండ్రుల కల నెరవేరనుంది. కేంద్రీయ విద్యాలయాల్లో రాష్ట్ర విద్యామండలి తయారు చేసిన సిలబస్ స్థానంలో కేంద్రం ప్రభుత్వం ఆధ్వర్యంలో పనిచేస్తున్న సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) వారు ప్రత్యేకంగా తయారుచేసిన సిలబస్ ఉండటమే ఇందుకు కారణం.

ఈ సిలబస్‌లో విద్యా బోధన అంతా ఇంగ్లీషుమాధ్యమంలో ఉండటం వల్ల విద్యార్థులు ఆరో తరగతినుంచే ఇంగ్లీషు మాధ్యమానికి అలవాటు పడతారు. ఒకసారి కేంద్రీయ విద్యాలయంలో అడ్మిషన్ పొందిన విద్యార్థి ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు, ఆ తర్వాత ఇంటర్ వరకూ నామమాత్రపు ఫీజులు చెల్లించి, కార్పొరేట్ స్థాయిలో విద్యను పొందే అవకాశాలున్నాయి. కేంద్రీయ విద్యాలయంలో విద్యను పూర్తి చేసిన విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వం వివిధ ఉద్యోగాల ఎంపికకు నిర్వహించే పోటీ పరీక్షలతోపాటు కేంద్రప్రభుత్వం ప్రతీ సంవత్సరం ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ వంటి ఉన్నత ఉద్యోగాలకోసం యూపీఎస్సీ నిర్వహించే సివిల్స్ ఉద్యోగాలు పొందే అవకాశాలు లేకపోలేదు. అత్యంత ఉన్నత ప్రమణాలతో కూడిన విద్య రానున్న రోజుల్లో జిల్లాలోని విద్యార్థులకు అందుబాటులోకి రానుంది.

కేంద్ర ప్రభుత్వ నిధులతో..

సూర్యాపేట జిల్లాలో త్వరలో ఏర్పాటు చేయనున్న కేంద్రీయ విద్యాలయ నిర్మాణ వ్యయం అంతా కేంద్రప్రభుత్వమే భరిస్తుంది. కేంద్రీయ విద్యాలయం స్థలం ఎంపిక మొదలుకొని, నిర్మాణం, ఉపాధ్యాయుల ఎంపిక, సిబ్బంది, విద్యార్థుల అడ్మిషన్ల ప్రక్రియ అంతా కేంద్ర ప్రభుత్వ నిధులతో జరుగుతుంది. కార్పొరేట్ స్థాయిలో పేద విద్యార్థులకు కేంద్రీయ విద్యాలయంలో ఉన్నత విద్య అందనుంది.

రానున్న విద్యా సంవత్సరం నుంచి అడ్మిషన్లు

2025 ఏప్రిల్ నుంచే సూర్యాపేట జిల్లాలో కేంద్రీయ విద్యాలయంను ప్రారంభించడానికి జిల్లా అధికార యంత్రాంగం ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. కేంద్రీయ విద్యాలయం స్థల ఎంపిక, నిర్మాణంవంటి పనుల కంటే ముందే తాత్కాలికంగా ఒక భవనాన్ని అద్దెకు తీసుకొని కేంద్రీయ విద్యాలయాన్ని ప్రారంభించాలని అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. అన్నీ సక్రమంగా జరిగితే 2025 ఏప్రిల్‌నుంచి కేంద్రీయ విద్యాలయం అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది.

అర్హత పరీక్షతోనే ఎంపిక

ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఆరో తరగతిలో ప్రవేశం పొందాలంటే కేంద్రీయ విద్యాలయం ప్రతీ సంవత్సరం అడ్మిషన్లను విడుదల చేస్తుంది. ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు అడ్మిషన్లకోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తులు చేసుకున్న వారికి సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) వారు ప్రవేశపరీక్షను నిర్వహిస్తారు. ఆ ప్రవేశపరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఇంటర్ వరకు విద్యనభ్యసించవచ్చు. ప్రవేశపరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఉచిత విద్యతోపాటు వసతి గృహ సదుపాయం, నాణ్యమైన భోజనం, క్రీడా సదుపాయం, సాంస్కృతిక కార్యక్రమాలు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం విద్యార్థులకు ఉంటుంది.

పేద విద్యార్థులకు న్యాయం చేయాలి



సూర్యాపేట జిల్లాలో ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న కేంద్రీయ విద్యాలయంలో ఎక్కువ అడ్మిషన్లను అల్పసంఖ్యాక విద్యార్థులకే కేటాయించాలి. కేంద్ర సర్వీసు ఉద్యోగుల పిల్లలకు కూడా ప్రవేశ పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగానే అడ్మిషన్ ఇవ్వాలి. అందరికీ సాధారణ ప్రవేశ పరీక్ష నిర్వహించాలి. జిల్లా కేంద్రంలోనే అందరికీ అందుబాటులో ఉండే విధంగా కేంద్రీయ విద్యాలయానికి స్థలం ఎంపిక చేయాలి. జిల్లాకు కేంద్రీయ విద్యాలయం రావడం సంతోషంగా ఉంది.

ప్రియాంక, సుందరయ్య నగర్, సూర్యాపేట.

పేదలకు మంచి భవిష్యత్



కేంద్రీయ విద్యాలయాన్ని జిల్లాలో ఏర్పాటు చేయడంతో పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదవడానికి మంచి అవకాశం కలగనుంది. రానున్న విద్యాసంవత్సరం నుంచి కేంద్రీయ విద్యాలయాన్ని ప్రారంభించాలి. రానున్న ఏడాది ప్రారంభంలోనే కేంద్రీయ విద్యాలయానికి ప్రవేశపరీక్షలు నిర్వహించాలి. జిల్లాకు కేంద్రీయ విద్యాలయం రావాలని చాలామంది తల్లిదండ్రులు కోరుకున్నారు. జిల్లాకేంద్రంలోనే విద్యాలయాన్ని ఏర్పాటు చేయాలి.

రజిత, గాంధీ నగర్, సూర్యాపేట

పందిళ్ల సాగుకు ప్రోత్సాహం



(5వపేజీ తరువాయి)

అవుతున్నాయి. పలు ప్రాంతాల్లో రైతులు వరికి ప్రత్యామ్నాయంగా కూరగాయలు సాగు చేస్తూ లాభాలు గడిస్తుండగా, ఈ ప్రాంతవాసులు సంప్రదాయ పంటలకే పరిమితమై నష్టాలపాలవుతున్నారు. ఈ నేపథ్యంలో రైతులకు ఆర్థికంగా చేయూతనివ్వడంతో పాటు 'మన ఊరికి సరిపోయే కూరగాయలు మనమే పండించుకుందాం' నినాదంతో జిల్లా రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించేలా ఉద్యానశాఖ చర్యలు తీసుకుంటోంది. జిల్లా జనాభాకు అనుగుణంగా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పూలసాగును విస్తరించేందుకు సన్నాహాలు చేస్తోంది. ప్రతీ గ్రామంలో కనీసం ఐదెకరాల్లో కూరగాయలు, ఆకుకూరలు సాగు చేయాలన్నది లక్ష్యం. జిల్లాలోని నేలలు, నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకొని, ఏ మండలంలో ఏయే పంటలు సాగు చేయాలనే అంశంపై ఉద్యానశాఖ కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. జిల్లాలో వానాకాలం, యాసంగితో కలిపి ప్రస్తుతం సుమారు 3వేల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. గ్రామానికి ఐదు ఎకరాల చొప్పున ఈ సీజన్‌లో మరో 2,100 ఎకరాల్లో కూరగాయలు సాగు చేయాలన్నది లక్ష్యం. జిల్లాలో నేలలు టమాటా, వంకాయ, బెండకాయ, దొండకాయ, సొర, చిక్కుడు, గోరుచిక్కుడు, దోసకాయ, మిర్చి, క్యాబేజీ, పొట్లకాయతో పాటు పాలకూర, మెంతి, కొత్తిమీర, పుదీనా, తోటకూర, తదితర పంటల సాగుకు అనుకూలం. గ్రామంలోకి ఇతర ప్రాంతాల నుంచి కూరగాయలు దిగుమతి కాకుండా రైతులు వారి పొలాల్లోనే సాగుచేసేలా అవగాహన కల్పిస్తున్నారు. ఏ మండలంలో దిగుబడి అయ్యే కూరగాయలు, ఆ ప్రాంతాల్లోనే విక్రయించుకునేలా చర్యలు తీసుకుంటున్నారు.

శివారులోనే కూరగాయల సాగు

జిల్లా హైదరాబాద్ నగరానికి చేరువలో ఉండటంతో కూరగాయలు పండించిన రైతులకు మార్కెటింగ్ అవకాశం కూడా సులువుగా ఉంటుంది. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఉద్యానపంటల సాగు విస్తీర్ణాన్ని రెట్టింపు చేసేందుకు ఆ శాఖ చర్యలు తీసుకుంటోంది. ప్రస్తుతం జిల్లాలో దిగుబడి అవుతున్న 50శాతం మేరకు కూరగాయలు నగరశివారు మండలాల్లోని బొమ్మలరామారం, తుర్కపల్లి, బీబీనగర్ మండలాల్లో సాగవుతున్నాయి. ప్రస్తుతం ఈ ప్రాంతాల్లో పండించిన కూరగాయలను కొంతమంది రైతులు నగరానికి తరలిస్తుండగా, మరికొంతమంది భువనగిరితోపాటు గ్రామాల్లో విక్రయించేందుకు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. భువనగిరితోపాటు పలు ప్రాంతాలకు నగరంలోని బోయిన్‌పల్లి, ఒంటిమామిడి మార్కెట్ల నుంచి కూరగాయలు దిగుమతి అవుతున్నాయి. దీంతో ధరలు కూడా నగరంతో సమానంగా ఉంటున్నాయి. స్థానికంగా కూరగాయలు సాగుచేసిన పక్షంలో ధరలు తగ్గే అవకాశం ఉంటుంది. జిల్లాలోని అన్ని మండలాల్లో కూరగాయల సాగును విస్తరించాలన్నది లక్ష్యం. ప్రస్తుతం జిల్లాలో 16వేల ఎకరాల్లో మామిడి, జామ, అల్లనేరేడు, నిమ్మ, దానిమ్మ, తదితర తోటలు సాగవుతున్నాయి. వీటిని మరో 20వేల ఎకరాలకు వరకు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. నల్లగొండ జిల్లాలో ప్రస్తుతం 2000 ఎకరాల్లో కూరగాయలు సాగవుతున్నాయి. అందులో సుమారు 1,000 ఎకరాలకు ఉద్యానశాఖ ప్రోత్సాహం అందిస్తుండగా, మరో 1,000 ఎకరాల్లో కూరగాయలను రైతులే స్వయంగా సాగుచేస్తున్నారు. నల్లగొండ జిల్లాలో అత్యధికంగా పీఏపల్లి మండలంలో దొండను రైతులు సాగుచేస్తున్నారు.

విధుల్లో నిర్లక్ష్యం.. హెచ్ఎం సస్పెన్షన్

త్రిపురారం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): త్రిపురారం మండలం రాజేంద్రనగర్ గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న నాగిపల్లి వెంకన్న విధుల్లో నిర్లక్ష్యం వహించడంతో శుక్రవారం సస్పెన్షన్‌కు గురయ్యారు. మండల విద్యాధికారి రవినాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. వెంకన్న ఆరు నెలల క్రితం అంజనపల్లి పాఠశాల నుంచి బదిలీపై రాజేంద్రనగర్‌కు వచ్చారు. అప్పటి నుంచి విధులకు సరిగా హాజరుకావడం లేదు. నవంబరు 28న వివరణ కోరుతూ నోటీసు అందజేశాము. ఆయన నుంచి స్పందన లేదని, విషయాన్ని డీఈవోకు తెలియజేయగా అదే నెల 28న వెంకన్నకు నోటీసు పంపించారు. అయినప్పటికీ అతని నుంచి సమాధానం రాలేదు. విధులల్లో నిర్లక్ష్యం వహించిన వెంకన్నను సస్పెండ్ చేస్తత డీఈవో భిక్షపతి శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

బంగారం, వెండి ఆభరణాలు చోరీ

నల్లగొండ క్రైం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీలో గురువారం రాత్రి ఓ ఇంట్లో చోరీ జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. పట్టణ పరిధిలోని పానగల్ రోడ్డులో ఉన్న ఎన్జీవోస్ కాలనీలో నివాసం ఉంటున్న పత్తిపాటి శిరీష తన ఇద్దరు పిల్లలతో కలిసి అదే కాలనీలో నివాసం ఉంటున్న ఆమె తల్లిగారింటికి గురవారం రాత్రి వెళ్లి అక్కడే నిద్రించి, శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చింది. ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళాలు పగలగొట్టడంతోపాటు బీరువాలోని నాలుగు తులాల బంగారు ఆభరణాలు, వెండి ఆభరణాలు సైతం చోరీకి గురైనట్లు గుర్తించింది. నల్లగొండ టూటౌన్ ఎస్ఐ రావుల నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

28 మంది ఆటో డ్రైవర్ల బైండోవర్


ఛలో అసెంబ్లీ నేపథ్యంలో 28 మంది ఆటో డ్రైవర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆటో డ్రైవర్ల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం తలపెట్టిన ఛలో అసెంబ్లీ నేపథ్యంలో నల్లగొండ టూటౌన్ పరిధిలో 28 మంది ఆటో డ్రైవర్లను ముందస్తుగా అదుపులోకి తీసుకుని బైండోవర్ చేసినట్లు రావుల నాగరాజు తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో తొమ్మిది మంది మృతి


గణేష్(ఫైల్)

నల్లగొండ క్రైం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థి దుర్మరణం పాలైన ఘటన నల్లగొండ జిల్లా కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్ మండలం నర్సింహాపురం గ్రామానికి చెందిన చిట్టిమళ్ల గణేష్ (18) జిల్లా కేంద్రంలోని నీలగిరి డిగ్రీ కళాశాలలో డిగ్రీ (ఎంపీసీఎస్) ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కళాశాల వెనకాల ఉన్న శ్రీనగర్ కాలనీలో ఉంటున్న గణేష్ అమ్మమ్మ శిలువేరు పద్మ ఇంటి వద్ద ఉంటూ రోజూ కళాశాలకు వెళ్లి వస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం ప్రకాశం బజార్‌కు వెళ్లి గణేష్ వాళ్ల అమ్మమ్మ పద్మను టీవీఎస్ ఎక్సల్‌పై తీసుకుని గడియారం సెంటర్‌లో స్వెటర్ల దుకాణాల వైపు నిలిపాడు. అదే సమయంలో హైదరాబాద్ రోడ్డు నుంచి బస్టాండ్ వైపు వస్తున్న లారీ ద్విచక్రవాహనాన్ని వెనక నుంచి ఢీకొట్టడంతో టీవీఎస్‌పై ఉన్న గణేష్ అమ్మమ్మ ఫుట్‌పాత్‌పై పడగా ఆమెకు సల్పగాయాలయ్యాయి. టీవీఎస్‌పై ఉన్న గణేష్ రోడ్డుపై పడడంతో లారీ గణేష్ తలపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెంటనే పోలీసులు లారీతోపాటు ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. గణేష్ తండ్రి చిట్టిమళ్ల రామలింగయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు నల్లగొండ టూటౌన్ ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

బైక్ అదుపు తప్పి..



వెంకటేశం(ఫైల్)

బైక్ అదుపు తప్పి ఒకరు మృతి చెందిన ఘటన శుక్రవారం నల్లగొండ పట్టణంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణంలో బొట్టుగూడకు చెందిన గంగిశెట్టి వెంకటేశం(50) తన సొంత మడిగెలో కిరాణ దుకాణం పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. రోజూ మాదిరిగానే కిరాణ సామగ్రి కోసం శుక్రవారం ఇంటి నుంచి బయటు దేరి టూటౌన్ పోలీస్ స్టేషన్ పక్క వీధిలో ఉన్న ఆయుర్వేద వైద్యశాల వద్ద అదుపు తప్పి కిందపడిపోయాడు. ప్రమాదంలో స్వల్పగాయాలైన వెంకటేశం వెంటనే లేచి అదే బైక్‌పై ఇంటికి వెళ్లాడు. కొద్ది సేపటి తర్వాత ఇంటి వద్ద అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. శరీరం లోపల బలమైన గాయాలు తగలడంతో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారని వారు పేర్కొన్నారు. వెంకటేశం భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నల్లగొండ టూటౌన్ ఎస్‌ఐ రావుల నాగరాజు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో..

మోత్కూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మోత్కూరు మునిసిపాలిటీ కేంద్రానికి చెందిన పందుల నగేష్ (35) జనగాం జిల్లా పాలకుర్తి నియోజకవర్గం కొడకండ్ల సమీపంలో మృతి చెందాడు. గ్రామస్తుల వివరాల ప్రకారం... పందుల నగేష్ అతని అత్తగారి ఊరైన లక్ష్మీదేవికాల్వలో ఉంటున్నాడు. అతను ఇళ్లలో పెయింటింగ్ పని చేస్తుంటాడు. పని మాట్లాడుకోవడానికి ఆయన శుక్రవారం కొడకండ్ల వెళ్లాడని, సాయంత్రం బైక్‌పై తిరిగి ఇంటికి వెళుతూ ప్రమాదవశాత్తు మృతి చెందాడని చెబుతున్నారు. మృతుడికి భార్య ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. అతను బైక్ పైనుంచి కింద పడ్డాడా, ఏదైనా వాహనం ఢీ కొట్టిందా, అన్న వివరాలు తెలియాల్సి ఉంది.

కారు ఢీకొని.. తల్లీ, కుమారుడు



ఘటనాస్థలిలో మాదిరెడ్డి సంధ్య, క్రాంతి మృతదేహాలు

యాదగిరిగుట్ట రూరల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తల్లీకుమారుడు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడిన ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో జరిగింది. శుక్రవారం సీఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ ఈసీఎల్ దమ్మాయిగూడకు చెందిన మాదిరెడ్డి సంధ్య (35), కుమారుడు మాదిరెడ్డి క్రాంతి (15), బంధువు రాజుతో కలిసి ముగ్గురు ద్విచక్రవాహనంపై ఆలేరు మండలం కొలనుపాక గ్రామానికి వచ్చారు. పనులు ముగించుకొని తిరుగు పయనం కాగా, వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారిపై హైదరాబాద్‌కు వెళ్తున్నారు. అదే సమయంలో వెనుక వైపు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారు ద్విచక్రవాహనాన్ని ఓవర్‌టెక్ చేసే క్రమయంలో వీరిని ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనంపై వెళ్తున్న తల్లీ, కుమారుడు అక్కడికక్కడే మృతి చెందగా, వాహనాన్ని నడుపుతున్న రాజు తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ఆలేరు ఏరియా ఆసుపత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్ తెలిపారు.

అంత్యక్రియలకు వెళ్లివస్తూ..

కోదాడ రూరల్, డిసెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని తొగర్రాయి గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య మృతిచెందగా, భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోతె మండలం నర్సింహాపురం గ్రామానికి చెందిన పి.రమేష్, అతని భార్య విజయలక్ష్మి (38) ద్విచక్రవాహనంపై శుక్రవారం ఉదయం తొగర్రాయి గ్రామంలో తన బావమరిది చనిపోతే అంత్యక్రియలకు హాజరయ్యారు. తిరిగి తమ సొంతూరు నర్సింహాపురం వెళ్లేందుకు తొగర్రాయి నుంచి కోదాడకు వస్తుండగా, సబ్‌స్టేషన్ వద్ద వెనుక నుంచి వచ్చిన ట్యాంకర్ ఢీకొట్టడంతో విజయలక్ష్మి అక్కడికక్కడే మృతిచెందారు. కాగా రమేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. అతన్ని వెంటనే కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు.

చివ్వెంల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో డీసీఎం డ్రైవర్ మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలం ఎరసానిగూడెం గ్రామానికి చెందిన రేపాక సురేందర్‌రెడ్డి(49) డీసీఎం డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి మేడ్చల్ నుంచి టెలిఫోన్ టవర్స్ ప్యాడ్స్ లోడుతో జార్ఖండ్‌కు వెళ్తున్నాడు. మార్గంమధ్యలో సూర్యాపేట జిల్లా ఐలాపురం గ్రామ శివారులో అర్ధరాత్రి సమయంలో తన ముందు వెళ్తున్న గుర్తుతెలియని వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో డీసీఎం ముందుభాగం దెబ్బతినగా, సురేందర్‌రెడ్డి తలకు, కాళ్లకు, చేతులకు ఇతర చోట్ల బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సురేందర్‌రెడ్డి బామర్ది వెంకట్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కనకరత్నం తెలిపారు.

ద్విచక్రవాహనం పై నుంచి పడి..

రాజాపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం బంటుగూడెనికి చెందిన గొల్లెన భిక్షపతి (55) శుక్రవారం ద్విచక్రవాహనంపై నుంచి పడి మృతి చెందాడు. శుక్రవారం సాయంత్రం బంటుగూడెం నుంచి రాజాపేటకు వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి ప్రమాదవశాత్తు జారిపడడంతో ఆయనకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ..

నడిగూడెం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం జరిగింది. సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలంలోని రత్నవరానికి చెందిన రామిని వెంకటరెడ్డి (60) ఉపాధి నిమిత్తం హైదరాబాద్ వెళ్లి అక్కడే ఉంటున్నారు. రెండు రోజుల క్రితం ద్విచక్రవాహనంపై వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురికాగా, ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వెంకటరెడ్డికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	578.30
టీఎంసీలు	278.1082
ఎడమకాల్వకు నీటి విడుదల	8280
కుడికాల్వకు	8067
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	2,400 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	35,315
అవుట్‌ఫ్లో	49,305 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	644.23అడుగులు
టీఎంసీలు	4.28
ఎన్ని గేట్ల ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్ ఫ్లో	61.88 క్యూసెక్కులు

ఆలోచన.. ఆలోచింపజేసేలా..

● కోదాడలో ఆకట్టుకున్న సైన్స్ విజ్ఞాన ప్రదర్శన ● వివిధ ప్రయోగాలు రూపొందించిన విద్యార్థులు

సూర్యాపేట జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో కోదాడ పట్టణంలోని సీసీరెడ్డి కాన్వెంట్‌లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న 52వ జిల్లాస్థాయి సైన్స్ విజ్ఞాన ప్రదర్శనలు శుక్రవారం ముగిశాయి. ఈ ప్రదర్శనలో విద్యార్థులు తయారుచేసిన ప్రయోగాలు అందరినీ ఆలోచింపజేసే విధంగా ఉన్నాయి. బస్సు ప్రమాదాలు జరగకుండా కొల్లు మహేంద్ర చేపట్టిన ప్రయోగం, పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్‌ను రీ సైక్లింగ్ ద్వారా టైల్స్, ఇటుకలు, పలు రకాల ప్లాస్టిక్ వస్తువులను తయారీపై విద్యార్థి నిఖిల్,బాల సైదులు చేపట్టిన ప్రయోగం అందరినీ ఆకట్టుకున్నాయి. దీంతో పాటు పలు రకాల ప్రయోగాలను ప్రదర్శించారు.

- (ఆంధ్రజ్యోతి, కోదాడ రూరల్)

ఇంధన పొదుపు పర్యావరణ పరిరక్షణ



ప్రదర్శనతో **ఉపయోగం :** రోడ్డు మీదభద్రత ఇంధన పొదుపు పర్యావరణ పరిరక్షణ ప్రాణ రక్షణ..
టీచర్ : సాలే హబేగం..
విద్యార్థి పేరు: మనోహర్..
పాఠశాల పేరు: జడ్పీహెచ్ఎస్ టేకుమట్ల
తరగతి : 9వ తరగతి

బస్సు ప్రమాదాల నివారణ



ప్రదర్శనఅంశం : ఇంటిలిజెంట్ బస్
విద్యార్థి పేరు : కొల్లు మహీధర్ **తరగతి :** 9వ తరగతి
పాఠశాలపేరు : ఎంఎస్ఆర్ సెంట్రల్ స్కూల్,దురాజ్‌పల్లి,సూర్యాపేట
ప్రదర్శనతో ఉపయోగం : బస్ ప్రమాదాలను నివారించడంతో పాటు బస్సులో డ్రైవర్ ఆల్కహాల్ తీసుకుంటే వెంటనే బస్సు ప్రయాణికులను అలర్టు చేస్తుంది. దీంతో పాటుగా ప్రమాదాలను సైతం గుర్తించి ముందుగానే పసిగట్టి ప్రయాణికులకు, కండక్టర్‌కు సమాచారం అందిస్తుంది. గుండెపోటు వచ్చే డ్రైవర్లను కూడా గుర్తించి ముందుగానే పసిగట్టి అలారం శబ్దం ప్రయాణికులు డ్రైవర్ ప్రమాదాల్లో ఉన్న విషయాన్ని గుర్తించవచ్చు అని విద్యార్థి వివరించారు. **గైడ్ టీచర్ :** జిలాన్ బాషా

ప్లాస్టిక్ వ్యర్థాలతో బ్రిక్స్, టైల్స్ తయారీ



విద్యార్థి పేరు : వి. నిఖిల్,బాల సైదులు
టీచర్‌పేరు: మన్మథరెడ్డి
పాఠశాల తరగతి : జడ్పీహెచ్ఎస్ కొక్కిరేణి, మునగాల మండలం
ప్రదర్శన **ఉపయోగం :** ప్లాస్టిక్ మన జీవితంలో ఒక భాగం అయింది. ప్లాస్టిక్ వాడని ఇల్లు లేదంటే ఆశ్చర్యం లేదు. ఈ ప్లాస్టిక్‌ను వినియోగించి ఎక్కడ పడితే అక్కడ పడేస్తున్నారు. ఇవి నెలలో కలసిపోని వ్యర్థం కావడంతో మొక్కల పెరుగుదలకు, వర్షపు నీరు భూమిలో ఇంకకుండా ఆటంకం కల్పిస్తుంది. ఈనేపథ్యంలో ప్లాస్టిక్‌ను సమర్థవంతంగా వినియోగించాలని నిర్ణయి ంచుకున్నాము.
సేకరణ : వేస్ట్ డంపింగ్ యార్డు నుంచి ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు కొన్ని బస్తాలకు సేకరించారు. ఉపాధ్యాయుల సలహా మేరకు వాటిని కరిగించి ప్లాస్టిక్ బ్రిక్స్, టైల్స్, ఆక్యు ప్రైజర్ మ్యాట్స్ తయారు చేశాం. ఈ ప్లాస్టిక్ టైల్స్ ఇటుకలు చాలా గట్టిగా బలంగా ఉన్నాయి. ఇవి ఈ వర్షానికి పాడు కావు. జీవిత కాలం చాలా ఎక్కువ రంగులు వేసి వాడడం వల్ల కార్యాలయానికి ఆఫీసు ఇళ్ల ముందు చాలా ఆకర్షణీయంగా ఉంటుంది. దీని వల్ల ప్లాస్టిక్ వర్థం ఎక్కడ పడితే అక్కడ లేకుండా చేయవచ్చు. అందరికీ ఉపయోగపడే రీతిలో మార్చవచ్చు.



హెల్పింగ్ వాకర్
విద్యార్థి పేరు : జాటోతు శివాని
పాఠశాల పేరు : కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, తిరుమలగిరి మండలం
తరగతి : 9వ తరగతి
గైడ్ టీచర్ : పాలోజు శిరీష
ప్రదర్శనలో ఉపయోగం : వృద్ధులు ప్రమాదవశాత్తు కాలు విరిగి, కాళ్ల సర్జరీ అయిన రోగులు మెట్లు ఎక్కడానికి, దిగడానికి వీలుగా లెగ్స్ మార్పు చేసుకోగల సౌలభ్యం హెల్పింగ్ వాకర్ తయారు చేశారు.



సోలార్ ఎనర్జీ వినియోగం
ప్రదర్శన : సోలార్ కుక్కర్‌తో కాలుష్యం తగ్గించటం .
విద్యార్థి : ఉపేందర్‌రెడ్డి
పాఠశాల పేరు : జడ్పీ హెచ్ఎస్ నరసింహుల గూడెం
ఉపయోగం : సోలార్ కుక్కర్ వినియోగానికి కేవలం సూర్యరశ్మి మాత్రమే అవసరం కట్టెలు, పిడకలు, కిరోసిన్, వంటగ్యాస్, లాంటి ఇంధనం అవసరం లేదు. సోలార్ ఎనర్జీని ఉచితంగా అపరిమితంగా వినియో గించుకోవడం మూలంగా కాలుష్యాన్ని తగ్గించవచ్చు నివారించవచ్చు. **గైడ్ టీచర్ :** ఎస్. శ్రీనివాస్,

ఎలక్ట్రానిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్



ప్రదర్శన అంశం: ఎలక్ట్రానిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్
విద్యార్థి పేరు : డి. స్మైలిక
పాఠశాల తరగతి : జడ్పీహెచ్ఎస్ వెలుగుపల్లి. **తరగతి :** 8వ తరగతి
ఉపయోగం: వేస్ట్ ఎలక్ట్రానిక్స్ వస్తువులతో చిన్న పిల్లలకు ఆనందాన్ని ఇచ్చే ఉపయోగపడే ఆట బొమ్మలు తయారు చేసుకోవచ్చు.
గైడ్ టీచర్ : ఎండీ జమీల్ షరీఫ్

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



శాలిగౌరారం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం మాదారం జడ్పీ హై స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న బత్తుల శివ శంకర్ అథ్లెటిక్స్‌లో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు శాలిగౌరారం మండలం సీఎం కప్ ఇన్‌చార్జి, పీడీ చివుట జ్యోతి తెలిపారు. నల్లగొండలో నిర్వహించిన సీఎం కప్ క్రీడల్లో 100 మీటర్ల పరుగు పందెంలో జిల్లాస్థాయిలో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీకి ఎంపికయ్యాడు. బత్తుల శివశంకర్‌ను పాఠశాల ఉపాధ్యాయులు, మండల అధికారులు అభినందించారు.

సాగర్ చివరి ఆయకట్టుకు నీరందేలా చర్యలు



నల్లగొండ, నాగార్జునసాగర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సాగర్ ఎడమ కాల్వ చివరి భూములకు నీరందేలా అధికారులు సమన్వయం చేసుకోవాలని చీఫ్ ఇంజనీర్ వి. అజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఎడమ కాల్వ కింద మొత్తం 6.30 లక్షల ఎకరాలకు నీరు అందించేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధంగా ఉందన్నారు. ఎగువ రైతాంగం దిగువ రైతాంగానికి తోడ్పాటు నందించాలని సూచించారు. గండ్లు పెడితే ఉపేక్షించబోమన్నారు. రైతులు నీటి పొదుపును అలవర్చుకోవాలన్నారు. యాసంగి పంటకు సరిపడా నీళ్లు అందించాలని నీటిపారుదల పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో ఈ నెల 15 నుంచి నీటిని విడుదల చేశామన్నారు. మొత్తం 120 రోజులు నీటిని అందించేందుకు నీటి పారుదల శాఖ ప్రణాళికలు రూపొందించుకుందని అందుకు అనుగుణంగా మొదటి దఫా యాసంగి పంట నాట్లు పడేంత వరకు అంటే 27రోజులు నీరు అందిస్తామన్నారు. మిగిలిన ఆరు దఫాలుగా అందించే నీరు ఒక్కో దఫాకు తొమ్మిది రోజుల చొప్పున అందిస్తామన్నారు. ఏప్రిల్ 23 వరకు నీరు అందించనున్నట్లు వెల్లడించారు.

ఏఎమ్మార్పీ కింద ఆరుతడి పంటలు మేలు

ఎఎమ్మార్పీ కింద ఆరుతడి పంటలు రైతులకు ప్రయోజనం చేకూరుస్తాయని నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ వి.అజయ్ కుమార్ తెలిపారు. నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశానుసారం ఈనెల 15 నుండి ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో నీళ్లు విడిచి పెట్టినట్లు ఆయన వివరించారు. హైలెవల్ కెనాల్ కింద 1.97లక్షల ఆయకట్టుకు, లోలెవల్ కెనాల్ కింద 42,950 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించేందుకు ప్రణాళికలు రూపొందించుకున్నామని పేర్కొన్నారు.

నూతన మెనూ మాతో కాదు

(5వ పేజీ తరువాయి)

సుమారు 2,500 మంది విద్యార్థులు వసతి పొందున్నారు. దీంతో పాటు ఎస్టీ హాస్టళ్లు 21 ఉన్నాయి. అందులో ప్రీమెట్రిక్ 13, పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లు 8 ఉన్నాయి. వీటిలో సుమారు 2,800 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. నల్లగొండ జిల్లాలో ఎస్సీ హాస్టళ్లు 60 ఉండగా, అందులో 4,700 మంది విద్యార్థులు, ఎస్టీ హాస్టళ్లు 42 ఉండగా, అందులో 5వేల మంది, బీసీ హాస్టళ్లు 46 ఉండగా అందులో 2,200 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. యాదాద్రి జిల్లాలో బీసీ హాస్టళ్లు 15 ఉండగా, అందులో 972 మంది విద్యార్థులు, ఎస్సీ హాస్టళ్లు 21 ఉండగా 1,462 మంది, ఎస్టీ హాస్టళ్లు 8 ఉండగా, 570 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు.

గురుకులాల్లో కాస్త మెరుగు

ప్రభుత్వం ప్రకటించిన మెనూ అమలు విషయంలో గురుకుల విద్యాలయాలు కాస్త మెరుగ్గా ఉన్నాయి. గురుకులాలకు ఆహారం అందించే బాధ్యతను ప్రభుత్వం ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పగించింది. రోజు వారీగా విద్యార్థులకు మెనూ ప్రకారం అందించాల్సిన కూరగాయలు, కిరాణ సరుకులు, పండ్లు, చికెన్, మటన్, గుడ్లు, పాలు వంటి వాటిని ఈ కాంట్రాక్టర్లు సరఫరా చేస్తున్నారు. వచ్చిన సరుకులు, కూరగాయలను విద్యార్థులకు వండి పెట్టే పనిని కూడా ప్రభుత్వం ఏజెన్సీలకు అప్పగించింది. దీంతో అక్కడ నూతన మెనూ అమలులో ఎలాంటి ఇబ్బందులు లేవు.



కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు వినతి పత్రం అందజేస్తున్న హాస్టల్ అసోసియేషన్ నాయకులు

ధరల ప్రకారం మెనూ సిద్ధం చేయాలి



ప్రస్తుత మార్కెట్ ధరలను పరిశీలించి నూతన మెనూను సిద్ధం చేయాలి. ప్రభుత్వం ప్రకటించిన మెనూ ఇప్పటి ధరలతో అమలు చేయడం సాధ్యం కావడం లేదు. దీంతో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించలేకపోతున్నాం. ప్రభుత్వం ధరలు, గ్రాముల వివరాలు ప్రకటించాలి. బీసీ వెల్ఫేర్ కమిషనర్ ఇటీవల తయారు చేసిన మెనూను ప్రస్తుతం అమలు చేస్తున్నాం. నూతన మెనూ అమలు విషయంలో వార్డెన్లపై ఒత్తిడి తగ్గించాలి.

● ఎం.సైదులు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ అసోసియేషన్ సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి

కలెక్టర్లకు వినతి

ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన నూతన మెనూ అమలు చేయడం సాధ్యం కాదని, ఈ విషయంలో వెసులుబాటు కల్పించాలని కోరుతూ వార్డెన్లు ఆయా జిల్లాల కలెక్టర్లకు ఇప్పటికే వినతిపత్రాలు అందజేశారు. అంతేగాకుండా ధరలు, గ్రాములు ప్రకటించకుండా మెనూ అమలు సాధ్యం కాదని స్పష్టం చేశారు. ఈ విషయంలో కొందరు సంక్షేమాధికారులు వార్డెన్లపై ఒత్తిడి తెస్తున్నారని కలెక్టర్లకు వివరించారు. తమపై వెంటనే ఒత్తిళ్లను నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు.

ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది

ప్రభుత్వ హాస్టళ్లలో నూతన మెనూ అమలు విషయంలో వార్డెన్లు ఇప్పటికే కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుత ధరలతో నూతన మెనూ అమలు చేయడం సాధ్యం కాదని వారు చెబుతున్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చే వరకు పాత మెనూనే అమలు చేస్తున్నాం. వార్డెన్లపై ఎలాంటి ఒత్తిడి తేవడం లేదు.

లత, సూర్యాపేట జిల్లా ఎస్సీ కులాల అభివృద్ధి అధికారి

ప్రకృతి వైద్యమే ప్రజలకు శ్రీరామరక్ష

యాదగిరిగుట్ట రూరల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైద్యమే ప్రజలకు శ్రీరామరక్ష అని గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ గాంధీ విజ్ఞాన్ ప్రతిష్టాన్ చైర్మన్ గున్న రాజేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గుట్టలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కోసం గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ అనేక దశాబ్దాలుగా ప్రయత్నం చేస్తోందని అన్నారు. ఇందులో భాగంగా డిసెంబరు 22న యాదగిరిగుట్టలో జరిగే జాతీయ గాంధీ సుస్థిర విజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సేంద్రియ ఎరువుల ద్వార భూసారాన్ని ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతూ విశేష కృషి చేస్తున్న 10రాష్ట్రాలలోని 115 మంది రైతు దంపతులకు పుడమిమిత్ర అవార్డులు, వ్యవసాయ అనుబంధ రంగాలలో కృషి చేస్తున్న అధికారులు, వైద్యులు, శాస్త్రవేతలు, జర్నలిస్టులకు 35 మందికి కిసాన్ సేవా రత్న అవార్డును అందజేస్తామన్నారు. సదస్సుకు రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, స్థానిక ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఇతర ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో ప్రతిష్టాన్ రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రెటరీ మెరుగు మధు, కార్యక్రమ కన్వీనర్ పడమటి పావని, జిల్లా అధ్యక్షుడు మాటూరి అశోక్, జీజీపీ జిల్లా అధ్యక్షుడు కొత్త బాలరాజు, పాలకూర వెంకటేశం, వెల్దురి భాగ్యలక్ష్మీ, అచ్చయ్య, మిర్యాల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



యాదగిరిగుట్టలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవ

పూజల్లో పాల్గొన్న త్రిపుర రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ అమర్‌నాథ్‌గౌడ్



యాదగిరిగుట్ట ప్రధానాలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో పాల్గొన్న మహిళలు

భువనగిరి అర్బన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారి సన్నిధిలో శుక్రవారం స్వామివారికి సువర్ణపుష్పార్చన, ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా కొనసాగాయి. ఆగమశాస్త్ర రీతిలో వేడుకలు నిర్వహించిన అర్చకులు వేకువజామున సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపి పంచామృతాలు, వేదమంత్ర పఠనాలతో అభిషేకం, తులసీదళాలు, కుంకుమతో అర్చించారు. ప్రాకార మండపంలో హోమం, నిత్యకల్యాణం సంప్రదాయరీతిలో కొనసాగాయి. సాయంత్రం ప్రధానాలయలంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారిని పట్టు వస్త్రాలు, ముత్యాలు, బంగారు ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి సేవలో తీర్చిదిద్దారు. అమ్మవారి సేవను ఆలయ తిరువీధుల్లో ఊరేగించిన అర్చకులు ప్రాకార మండపంలోని అద్దాల మండపం ఊయలలో అధిష్ఠింపజేశారు. అర్చకుల వేద మంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నీరాజనాల నడుమ ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. పాతగుట్ట ఆలయంలో నిత్యపూజలు సంప్రదాయరీతిలో కొనసాగాయి. శివాలయంలో పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి వారికి నిత్యపూజలు, యాగశాలలో చండీహోమం శైవాగమ పద్ధతిలో చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల నుంచి రూ.30,29,923 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ భాస్కర్‌రావు తెలిపారు. త్రిపుర రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ టి.అమర్‌నాథ్‌గౌడ్ కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం చేసి ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా దివ్య విమాన గోపురం బంగారు తాపడానికి రూ.50వేల చెక్కు అందజేశారు. అదేవిధంగా స్వామివారి సన్నిధిలో ధనుర్మాస ఉత్సవాలు ఐదో రోజు శుక్రవారం వైభవంగా కొనసాగాయి.

శాస్త్రోక్తంగా మట్టపల్లి వాసుని కల్యాణం

మఠంపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మట్టపల్లి క్ష్మీనృసింహుడి క్షేత్రంలో స్వామివారి నిత్య కల్యాణాన్ని వేదపండితులు శుక్రవారం కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయంలో విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాసన, మంగాల్య ధారణ తలంబ్రాలుతో కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు నీరాజనమంత్రపుష్పాలతో మహానివేదించిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరిమట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్, అర్చకులు తూమాటి శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, కృష్ణామాచార్యులు, రామాచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు తదితరులు పాల్గొన్నారు.


కృష్ణమ్మకు మంగళ హారతి

మట్టపల్లి శ్రీలక్ష్మీ నరసింహుని క్షేత్రంలో శుక్రవారం కృష్ణమ్మకు మహిళలు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవిత్ర కృష్ణనదికి పసుపు, కుంకుమార్చనలు, అభిషేకాలు, సరెచీర సమర్పించి దీపాదనలు చేశారు. వేద పండితుల ఆధ్వర్యంలో కృష్ణమ్మకు మంగళ హారతి ఇచ్చి భక్తులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నల్లగొండలో ముస్తాబైన చర్చిలు







నల్లగొండలో..

సెమీ క్రిస్మస్.. అంతటా సందడి

క్రిస్మస్ వేడుకలకు నల్లగొండ జిల్లాలోని చర్చిలన్నీ ముస్తాబయ్యాయి. సెమీ క్రిస్మస్ వేడుకల్లో భాగంగా దైవ గీతాలు, ప్రార్థనలు, బైబిల్ పఠనాలు, సందేశాలతో చర్చిలన్నీ సందడిగా మారాయి. హ్యాప్పీ క్రిస్మస్.. మెరీ క్రిస్మస్ అంటూ క్రిస్మస్ తాత ముచ్చట్లతో సందడి చేస్తున్నాడు. రంగు రంగుల విద్యుత్ దీపాలతో చర్చిలను ముస్తాబు చేశారు. చర్చి పాదర్లు వారం రోజుల నుంచే చర్చిల్లో, క్రైస్తవుల ఇళ్లలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు. క్రిస్మస్ వేడుకలకు బంధు మిత్రులను ఆహ్వానిస్తున్నారు. ఇళ్లపై స్టార్, ట్రీతో అలంకరించారు.

- (ఆంధ్రజ్యోతి), నల్లగొండ కల్చరల్ .



చర్చిలో దైవ గీతాలు ఆలపిస్తున్న మహిళలు, చిన్నారులు

ఆధ్యాత్మికం.. అక్షర జ్ఞానం అవంతీపురం

» కొనసాగుతున్న ధనుర్మాస ఉత్సవాలు

మిర్యాలగూడ రూరల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం అవంతీపురం ప్రకృతి సోయగాలతో అలరారుతోంది. శ్రీ శృంగేరి శారదా పీఠం ఆధ్వర్యంలో సాగుతున్న శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మా స ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ తిరుప్పావై పాశుర పఠనం ఆలయ అర్చకుల వేదమంత్రోచ్ఛరణల నడుమ ఆధ్యాత్మికంగా కొనసాగుతున్నాయి. పట్టణానికి సమీపంలో అవంతీపురం కొండపై ప్రముఖ వైద్యుడు తిప్పిరినేని శరత్‌బాబు పద్మావతి దంపతులు 1980లో నిర్మాణం చేపట్టారు. నాటి నుంచి అంగరంగ వైభవంగా ప్రతిరోజూ ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా జనవరి 10న ముక్కోటి ఏకాదశి ఉత్తర ద్వార దర్శనం, 11న అమ్మవారికి కుడారై మహా నైవేద్యం సమర్పణ, 13న శ్రీగోదాదేవి రంగనాథుల కల్యాణ వేడుకలను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలిస్తారు. ప్రకృతి అందాలు, నడుమ ప్రశాంత వాతావరణంలో ఆల యం దర్శనమిస్తుంది. దీనికి తోడు సరస్వతీ దేవి ఆలయం నిర్మించడంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలు, పక్క రాష్ట్రాల నుంచి వచ్చి తమ చిన్నారులకు అక్షరభ్యాసం చేయిస్తారు.



శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుని విగ్రహమూర్తులు, సరస్వతీ అమ్మవారు

అన్ని వసతులు, సౌకర్యాలు ఉన్నాయి



ఆలయాలకు వచ్చే భక్తులకు అన్ని వసతులు, సౌకర్యాలు ఏర్పాటు చేశాం. ప్రత్యేక పూజా కార్యక్రమాలే కాకుండా వివాహ, తదితర శుభకార్యాలకు కల్యాణ మండపం అందుబాటులో ఉంది.

- రామచంద్రప్రసాద్, ఆలయ మేనేజర్

సగం ఇళ్లకే నల్లా కనెక్షన్లు



మునిసిపల్ కార్యాలయం

- రెవెన్యూ రికార్డులో 42 వేల ఇళ్లు
- ఇంజనీరింగ్ రికార్డులో 28,898 ఇళ్లు
- శివారు ప్రాంతాల్లో లెక్క శూన్యం
- భారీ మొత్తంలో ఆదాయం కోల్పోతున్న నీలగిరి మునిసిపాలిటీ

రామగిరి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలో 48వార్డుల్లో 42వేల గృహనిర్మాణాలు ఉన్నట్లుగా రెవెన్యూ శాఖ రికార్డులు చెబుతున్నాయి.కానీ ఇంజనీరింగ్ శాఖ రికార్డుల్లో మాత్రం, మంచినీటి కుళాయి కనెక్షన్లు 28,898 లెక్కలు చూపిస్తున్నాయి. ఇవి మునిసిపల్ అధికారిక లెక్కలు. వాస్తవానికి ప్రతీ ఇంటికి ఒక మంచినీటి కనెక్షన్ ఉంటుంది. ఈ లెక్కన ఒక్కో ఇంటికి ఒక్కో నల్లా కనెక్షన్ చొప్పున 42 వేల కనెక్షన్లు ఉండి తీరాల్సిందే.కానీ అధికారికంగా 28,898 మాత్రమే ఉన్నాయి. అంటే 13,102కనెక్షన్లు అక్రమంగా కొనసాగుతున్నట్లు అధికారిక లెక్కలు చూస్తే స్పష్టమవుతుంది. ఇకపోతే నల్లగొండ పట్టణంలో 7 విలీన గ్రామాలు, శివారు ప్రాంతాల్లో అసిస్‌మెంట్ కాని గృహాల సంఖ్య సుమారు మరో 10వేలపైనే ఉంటుంది. వీటికి కూడా మంచినీటి కనెక్షన్లు ఉన్నాయి.కానీ అధికారిక రికార్డులో మాత్రం ఈ గృహాలకు మంచినీటి కనెక్షన్లులేవు.దీనికంతటికి కారణం ఫిట్టర్ల చేతివాటమేనని పట్టణ ప్రజలు బహిరంగంగానే ఆరోపణలు చేస్తున్నారు.

ఒక్కో కనెక్షకు రూ.5 నుంచి 10వేలు

వాస్తవానికి బీపీఎల్ గృహ యజమాని మంచి నీటి కనెక్షన్ కోసం మునిసిపల్ కార్యాలయంలో రూ.1తో, కమర్షియల్ కనెక్షన్ కోసమైతే రూ.6వేలు డీడీ తీసి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. కానీ ఆయా ప్రాంత ఫిట్టర్లు యజమానులను కార్యాలయానికి వెళ్లకుండా కనెక్షన్ ఇచ్చేది తామేనని అడ్డుకుంటున్నట్లు తెలుస్తుంది. ఒకవేళ కార్యాలయానికి వెళ్లినా తిరిగి నా వద్దకే రావాల్సి ఉంటుందని తెగేసి చెపుతుండటంతో ఆయా ఫిట్టర్ చెప్పిన ధరకే యజమానులు కనెక్షన్లకు ఒప్పుకోక తప్పడం లేదు. దీంతో ఒక్కో కనెక్షన్‌కు రూ. 5 నుంచి రూ. 10వేల చొప్పున వసూళ్లు చేస్తూ కనెక్షన్లు ఇస్తున్నట్లు తెలుస్తుంది. ఒకవేళ ఫిట్టర్లను కాదని కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్న యజమానులకు రకరకాల కారణాలు చెబుతూ నెలలకొద్దీ కనెక్షన్లు ఇవ్వకుండా తిప్పించుకుంటున్నట్లు కూడా సమాచారం. దీంతో చేసేదేమి లేక గృహ యజమానులు ఫిట్టర్లు చెప్పిన ధరకే కనెక్షన్లు తీసుకుంటున్నట్లు తెలుస్తుంది. ఇదిలా ఉండగా మరికొంతమంది ఫిట్టర్లు రాజకీయ ఒత్తిడిల మేరకు కూడా కనెక్షన్లు ఇస్తున్నట్లు సమాచారం. అయితే కనెక్షన్లు ఇచ్చిన వాటికి మునిసిపల్ కార్యాలయంలో రికార్డులు నమోదు చేయకుండా ప్రతీనెలా బిల్లులు ఫిట్టర్లే వసూళ్లు చేస్తు జేబులు నింపుకుంటున్నట్లు తెలుస్తుంది. ఇలాంటి కారణాల వల్లే నల్లా కనెక్షన్లు సగానికి పడిపోయినట్లుగా తెలుస్తుంది. ఇకపోతే టూటౌన్ ఏరియాలో ఓ ఫిట్టర్ రూ.30వేలు తీసుకొని మంచినీటి కనెక్షన్ ఇచ్చిన సంఘటనలో ఏర్పడిన పంచాయితీ రాజకీయ నాయకుల వద్దకు కూడా చేరినట్లు తెలిసింది.

వంద శాతం వసూళ్లు చేసి తీరుతాం

పేరుకుపోయిన నల్లా బిల్లులను వందశాతం వసూళ్లు చేసి తీరుతాం. ఇకపోతే అక్రమ కనెక్షన్లు గుర్తించేందుకు ప్రత్యేక బృందాన్ని రంగంలోకి దింపుతాం. మునిసిపల్ ఆదాయం పెరిగేందుకు ప్రతీ అక్రమ కనెక్షన్‌ను సక్రమం చేస్తాం. చేతివాటం ప్రదర్శించే ఫిట్టర్లపై చర్యలు తీసుకుంటాం.

- రాములు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్

మంచినీటి కనెక్షన్ల రాబడి కూడా అంతంతే...

నల్లగొండ పట్టణంలో అధికారికంగా ఉన్నా 28,898 నల్లా కనెక్షన్లుకు పన్ను రూపేనా ప్రతీ ఏడాది రూ. 3.5 కోట్లు ఆదాయం రావాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు రూ. 1.96కోట్లు మాత్రమే వసూళ్లు అయినట్లు తెలుస్తుంది. వసూళ్లే లక్ష్యంగా అధికారులు ఆయా మంచినీటి కనెక్షన్లు కత్తిరించి అయినా సరే పన్ను వసూళ్లు చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తుంది. ఇదిలా ఉండగా శివారు ప్రాంతాల్లో మిషన్ భగీరథ పథకం కింద ఇచ్చిన కనెక్షన్లు ఉచితమేనని కొంతమంది ప్రజలు భావిస్తునందునే మునిసిపల్ కార్యాలయానికి బిల్లులు చెల్లించడం లేదని సమాచారం.

'పుడమి' దరఖాస్తుల ఆహ్వానం

నార్కట్‌పల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పుడమి సాహితీ వేదిక 6వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని భారతీ లలిత కళా ఉత్సవ్‌లో భాగంగా వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన వ్యక్తులను జాతీయ పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు చిలుముల బాల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్య, వైద్య, సాంస్కృతిక, సాహిత్య, సామాజిక, క్రీడలు, యువజన సర్వీసులు, మహిళా సాధికారత రంగాల్లో విశేష సేవలందించిన వారిని వార్షికోత్సవం సందర్భంగా గుర్తించి సన్మానించనున్నట్లు తెలిపారు. ఎంపిక చేసిన వారిని ఈ నెల 29వ తేదీన ఖమ్మంలో నిర్వహించే కార్యక్రమంలో పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

ఆశాల సమస్యలు పరిష్కరించాలి

కేతేపల్లి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): తమ సమస్యల పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు ఆదిమళ్ల సుధీర్ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బస్సుజాతా 25వ తేదీన నల్లగొండకు చేరుకుంటుందని అన్నారు. శుక్రవారం కేతేపలిలో బస్సుజాతా పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. బస్సుజాతాలో ప్రతి ఆశాకార్యకర్త పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆశాల సంఘం మండల నాయకులు మంజుల, విజయరాణి, నాగలక్ష్మి, ఇందిర పాల్గొన్నారు.

క్రీడల బ్రోచర్ ఆవిష్కరణ

నల్లగొండ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి 25 వ తేదీ వరకు ఎన్‌జీ కళాశాల మైదానంలో నిర్వహించే 43వ షూటింగ్ బాల్ సీనియర్ మెన్, ఉమెన్ టోర్నమెంట్ బ్రోచర్‌ను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆవిష్కరించారు. శుక్రవారం పట్టణంలోని ఎన్‌జీ కళాశాల మైదానంలో నిర్వహించిన సమావేశంలో బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, షూటింగ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు దేశ నాగేందర్, కార్యదర్శి కందికట్ల రజిత, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.దాసు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

నాటక రంగానికి చేయూతనివ్వాలి

నార్కట్‌పల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నాటక రంగానికి చేయూత నివ్వాలని తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య (తెనాసస) రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమ అంజిరెడ్డి అన్నారు. సమాఖ్య నాయకులతో కలిసి రాష్ట్ర సంగీత, నాటక అకాడమీ చైర్‌పర్సన్ అలేఖ్య పుంజాలను మర్యాద పూర్వకంగా కలిశారు. సమాఖ్య నాయకులతో కలిసి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని కళాకారులందరికీ గుర్తింపుకార్డులు ఇవ్వాలని, వృద్ధ కళాకారులకు పింఛన్లు ఇవ్వాలని కోరారు. గ్రామీణ నాటక సంస్థలకు రాష్ట్ర భాషా సాంస్కృతిక విభాగం ద్వారా ఆర్థిక తోడ్పాటునందించాలని అన్నారు. రంగస్థల నాటకాలే జీవనోపాధిగా చేసుకున్న నాటక సమాజ కళాకారుల ఉపాధి కోసం విరివిగా నాటక సప్తాహాలను జిల్లాల వారీగా నిర్వహించాలని వినతిపత్రంలో కోరారు.

సీపీఐ శత వార్షికోత్సవ సభను విజయవంతం చేయాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి సత్యం

మర్రిగూడ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నల్లగొండలో 30వ తేదీన నిర్వహించే సీపీఐ శత వార్షికోత్సవ సభను విజయవం తం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూస్వామ్య, పెట్టుబడిదారి వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడుతూ భూ సమస్యను ఎజెండాగా తీసుకొని భూ పోరాటాల సామాజిక ఉద్యమాలకు నాంది పలికిన పార్టీ సీపీఐ అన్నారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి బిక్షంరెడ్డి, బూడిద సురేష్, బుర్ర శేఖర్, నిరంజన్, రఘుమయ్య, మహేందర్, కొమరయ్య సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



గీత కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న అచ్చాలు

గీత కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

చిట్యాల, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్ర భుత్వం ఎన్నికల సంద ర్భంగా గీత కార్మికులకు ఇచ్చిన హామీలను వెంట నే అమలు చేయాలని గీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పానుగుల్ల అచ్చాలు డిమాండ్ చేశారు. చిట్యాలలో శుక్రవారం జరిగిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన గీత కార్మికులందరికీ పింఛన్ ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియా వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. కల్లుగీత కార్మికులందరికీ ప్రమాదాలు జరగకుండా ఇ చ్చే సేఫ్టీ మోకులను అందివ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మామిడి హనుమంతు, గుణగంటి కృష్ణ, గుణగంటి బిక్షం, నకిరేకంటి రాములు, నాతి వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి

కేసీఆర్ నిరుపేదలను ఆదుకున్న ఘనుడు

శాలిగౌరా రం, డిసెంబ రు 20(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిరుపేదలను ఆ దుకున్న ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కిందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి అన్నారు. మండలంలోని తిరుమల రాయినిగూడెంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయనిధి పేదలకు వరం లాంటిదని అన్నారు. అనంతరం ఆరుగురు లబ్ధిదారులకు మంజూరైన రూ.2.05లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వడ్లకొండ బిక్షం, దీకొండ నరేందర్, కూరం వెంకన్న, వడ్లకొడ పాపయ్య పాల్గొన్నారు.

● మునుగోడు రూరల్: మునుగోడు మండలంలోని నేరటోనిగూడెం గ్రామానికి చెందిన యంపల్ల యాదగిరికి సీఎం సహాయ నిధి నుంచి రూ.31వేల విలువైన చెక్కు మంజూరైంది. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీమనపల్లి సైదులు, గ్రామ కాంగ్రెస్ నాయకులతో కలిసి యాదగిరికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కుంభం చెన్నారెడ్డి, వెంకన్న, పరమేష్, యాదయ్య పాల్గొన్నారు.

శాంభవీదేవికి వైభవంగా అభిషేకాలు



శాంభవీదేవి

చిట్యాలరూరల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మార్గశిర మాసం శుక్రవారం సందర్భంగా మండలంలోని నేరడ గ్రామంలో గల శ్రీమహమ్మాయి శాం భవీదేవి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అమ్మవారికి నార్కట్‌పల్లికి చెందిన గురిజ సంధ్య, క్రాంతి అభిషేక కార్యక్రమాలను నిర్వహించి పూజల్లో పాల్గొన్నారు. భక్తులు ఆలయానికి అధిక సంఖ్యలో హాజరై భక్తిశ్రద్ధలతో దర్శనం చేసుకున్నారు.

చిట్యాల మండలంలోని నేరడలో సీతారామాంజనేయస్వామి దేవాలయంలో 44వ మార్గశి ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం 5వ రోజు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు దేవాలయంలో తిరుప్పావై 5వ పాశురాన్ని పారాయణం చేశారు. దేవతామూర్తులకు మంగళహారతులను పట్టారు. అనంతరం అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందించి ఆశీర్వచనాలు అందజేశారు.

చెస్‌తో మేధస్సుకు పదును : డీఈవో



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీఈవో భిక్షపతి

నల్లగొండ స్పోర్ట్స్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చెస్‌తో మేధస్సుకు పదును పెరుగుతుందని, అలాంటి క్రీడల్లో విద్యార్థులు, యువకులు రాణించాలని డీఈవో భిక్షపతి అన్నారు. సీఎం కప్ 2024 జిల్లా స్థాయి క్రీడల్లో భాగంగా శుక్రవారం ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన చెస్, యోగా పోటీల విజేతలకు ఆయన బహుమతులు ప్రదానం చేసి మాట్లాడారు. విద్యార్థుల శారీరక ఎదుగుదలకు క్రీడలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. చెస్‌తో విద్యార్థుల విజ్ఞానం పెరుగుతుందని, యోగా వల్ల సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. ఆరు రోజుల నుంచి జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న పలు క్రీడా పోటీల్లో విద్యార్థులు పాల్గొని క్రీడా ప్రతిభను కనబరిచారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులు పోటీల్లో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

కార్యక్రమంలో డీవైఎస్‌వో కుంభం నర్సిరెడ్డి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి విమల, చెస్, యోగా, అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, వ్యాయామ ఉపాధ్యాయులు కరుణాకర్‌రెడ్డి, వాడపల్లి రవీందర్, కవిత, సురేందర్‌రెడ్డి, నాగరాజు, మాణిక్యం, సుల్తానా, అఫ్రజ్ తదితరులు పాల్గొన్నారు.

రోగులతో సేవాగుణంతో మెలగాలి



వెలిమినేడులో డాక్టర్ నర్సింహ, సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్

● డీఎంహెచ్‌వో డాక్టర్ పుట్ల శ్రీనివాస్

చిట్యాలరూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వివిధ అనారోగ్య సమస్యలతో ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల వైద్యులు, వైద్యసిబ్బంది సేవాగుణంతో మెలగాలని, లేనిచో సహించేది లేదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ హెచ్చరించారు. చిట్యాల మండలం వెలిమినేడు పీహెచ్‌సీ, దాని పరిధిలోని ఆరోగ్య ఉపకేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలోని సిబ్బంది హాజరు రిజిస్టర్, మందుల నిల్వలు, ల్యాబ్‌ను, ప్రసూతి గదిని పరిశీలించారు. రోగులకు అందిస్తున్న సేవల గురించి వైద్యాధికారి డాక్టర్ ఉబ్బు నర్సింహ, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని, రోగుల పట్ల జాగ్రత్తలను వహించాలని సూచించారు. అనారోగ్య సమస్యలతో వచ్చే వారికి స్వాంతన కలిగేలా మాట్లాడాలని, అలా చేస్తే బాధితులు సంతోషిస్తారని అన్నారు. ప్రతి ఒక్కరితోనూ సత్ప్రవర్తనతో మెలగాలని, ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించరాదని పరిశుభ్రతను, సమయ పాలనను పాటించి అంకితభావంతో పనిచేయాలని అన్నారు. లేనిచో శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

మర్రిగూడ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): శివన్నగూడ గ్రామంలోని శ్రీ నీలకంఠ స్వామి దేవస్థానం వెళ్లడానికి సీసీరోడ్డుతో పాటు నూతన రథం ఏర్పాటుకు దేవాలయ కమిటీ చైర్మన్ రాపోలు యాదగిరి శంకుస్థాపన చేశారు. శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ధర్మకర్తలు చిట్యాల రంగారెడ్డి, ముడిగ నర్సింహ్మ, మోర నర్సింహ, మాజీ సర్పంచ్ చిట్యాల సబితా యాదగిరిరెడ్డి, వెంకటాచారి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయానికి భక్తుల రద్దీ



ప్రత్యేక అలంకరణలో ఎల్లమ్మ

కనగల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కనగల్ మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో మార్గశిర మాసం శుక్రవారం పురస్కరించుకుని భక్తుల రద్దీ కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని చీరసారె బోనమైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం ఆలయంలో అమ్మవారికి ఆలయ అర్చకులు అభిషేకాలు. శ్రీలలిత సహస్ర నామార్చాన పూజలను నిర్వహించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు.

తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఏపీజీవీబీ విలీనం



నార్కట్‌పల్లి : సమావేశంలో మాట్లాడుతున్న రవికాంత్

నల్లగొండ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస బ్యాంకును విలీనం చేస్తున్నట్లు ఏపీ గ్రామీణ వికాస బ్యాంకు నల్లగొండ రీజియన్ రీజనల్ మేనేజర్ బి.విజయభాస్కర్‌గౌడ్ తెలిపారు. నల్లగొండలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత ప్రభుత్వం ఆర్థికసేవల శాఖ ఆదేశాల మేరకు తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఏపీజీవీబీని జనవరి 1వ తేదీ నుంచి విలీన ప్రక్రియ అమలులోకి వస్తుందని, కావున బ్యాంకు ఖాతాదారులు గమనించాలని తెలిపారు. విలీనం తర్వాత తెలంగాణ రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంత ప్రజలకు బ్యాంకింగ్ సేవలు సమర్థవంతంగా అందించనున్నట్లు తెలిపారు. ఒకే రాష్ట్రంలో ఒకే బ్యాంకు ఉండటమే వల్లే బ్యాంకింగ్ నిర్వహణ సులభతరం అవుతుందనే ఉద్దేశ్యంతో విలీనం చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కారణంగా ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు బ్యాంకు సేవలను నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. విలీనం కారణంగా ఖాతా నెంబర్ గాని ఐఎఫ్‌సీ కోడ్ గాని మారదన్నారు. ఏటీఎం కార్డులు, మొబైల్ బ్యాంకింగ్ సేవలు తిరిగి కొత్తగా తీసుకోవాలని తెలిపారు.

● శాలిగౌరారం మండలం పెర్కకొండారంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకులో నిర్వహించిన సమావేశంలో బ్రాంచ్ మేనేజర్ విఘ్నేష్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 493 శాఖలు రాష్ట్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు(టీజీబీ)లో విలీనమవుతున్నాయన్నారు. సమావేశంలో ఫీల్డ్ ఆఫీసర్ ప్రదీప్, క్యాషియర్ శివ తదితరులు పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని ఏపీజీవీబీ నిర్వహించిన సమావేశంలో శాఖ మేనేజర్ రవికాంత్ మాట్లాడారు. ఖాతాదారులు సహకరించాలని కోరారు. బ్యాంకు పరిధిలో నెట్ బ్యాంకింగ్, ఫోన్‌పే, గూగుల్ పే, మొబైల్ బ్యాంకింగ్, ఏటీఎం సేవలకు అంతరాయం ఏర్పడుతుందని ఆయన తెలిపారు. తిరిగి బ్యాంకింగ్ ఆర్థిక లావాదేవీలు కొత్త సంవత్సరం నుంచి ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. సమావేశంలో ఫీల్డ్ ఆఫీసర్ దిలీప్‌కుమార్, అకౌంటెంట్ షౌకత్, క్యాషియర్ నాగేశ్వర్‌రావు, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలి



చిట్యాలలో తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు నర్సింహ, నగేష్

చిట్యాల, శాలిగౌరారం, మర్రిగూడ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బ్యాంకుల నుంచి రుణం పొందిన రైతులందరికీ రుణమాఫీ చేయాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఐతరాజు నర్సింహ డిమాండ్ చేశారు. చిట్యాల తహసీల్దార్ కార్యాలయం శుక్రవారం సీపీఎం, రైతు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులకు ఇప్పటివరకు రుణమాఫీ పాక్షికంగానే జరిగిందని, ఎలాంటి షరతులు లేకుండా అందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా పథకం డబ్బుల పంపిణీ వెంటనే ప్రారంభించాలని అన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, మాజీ జడ్పీటీసీ పానుగుల్ల అచ్చాలు, నకిరేకంటి రాములు, లడే రాములు పాల్గొన్నారు.

● శాలిగౌరారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతు సంఘం నాయకులు ధర్నా నిర్వహించి అనంతరం తహసీల్దార్ యాదగిరికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ మహిళా రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ కందాల ప్రమీల మాట్లాడుతూ రైతాంగానికి రైతు భరోసాతో పాటు వెంటనే రూ. 2 లక్షల రుణమాఫీ పూర్తిగా అమలుచేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ రైతాంగానికి రైతు భరోసా ఇవ్వడంలో విఫలమైందని ఆరోపించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు చలకాని మల్లయ్య, సైదులు, శ్రీను, కల్లూరి లింగయ్య, బట్ట రామచంద్రు, సిరిపంగి అంజి, కారింగుల వెంకన్న, మల్లయ్య, నర్సింహ, లింగయ్య పాల్గొన్నారు.

● మర్రిగూడ తహసీల్దార్ కార్యాలయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏర్పుల యాదయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా పెండింగ్‌లో ఉన్న రైతు భరోసా, రుణమాఫీ రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల స్థలాలు, కొత్త రేషన్‌కార్డులు, దివ్యాంగులకు, వృద్ధాప్య పింఛన్ పెంచి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కొట్టం యాదయ్య, నీలకంఠ రాములు, దామర లక్ష్మి, సలోజు రామలింగాచారి, యాదయ్య పాల్గొన్నారు.

నిరంతరంగా సేవా కార్యక్రమాలు

● ప్రతీక్‌రెడ్డి వర్ధంతిలో మంత్రి కోమటిరెడ్డి



చిట్యాలలో ప్రతీక్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

చిట్యాల, డిసెంబరు 20, (ఆంధ్రజ్యోతి) : మంత్రి కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి పేరు మీద నల్లగొండ జిల్లాలో నిరంతరంగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. చిట్యాలలో శుక్రవారం నిర్వహించిన ప్రతీక్‌రెడ్డి వర్ధంతిలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ప్రతీక్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పోకల దేవదాస్‌బిక్షంరెడ్డిలింగస్వామి, వనమా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● నల్లగొండ, (ఆంధ్రజ్యోతి): మదర్ థెరిస్సా ఓల్డేజ్ హోమ్‌లో వృద్ధులు, మహిళలకు పౌష్టికాహారం అందజేసి దుప్పట్లను పంపిణీ చేశారు. వైఎంసీఏ రాష్ట్ర చైర్మన్ టీఎస్ విలియమ్స్, స్టేట్ కన్వీనర్ పసల శౌరయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు వేణుగోపాల్ రెడ్డి, సిస్టర్స్ రమ్య, ఎల్‌ఎన్ మేరీ పాల్గొన్నారు.

● కనగల్(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎక్స్‌రోడ్డులో మాజీ జడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రతీక్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక కస్తూర్బాగాంధీ పాఠశాలలో విద్యార్థులకు పండ్లను పంపిణీ చేశారు. అనంతరం నల్లగొండ ఎన్జీ కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహించిన మెగా రక్తదానం శిబిరంలో మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ బోగిరి రాంబాబు రక్తదానం చేశారు. ఆయా కార్యక్రమాల్లో మందడి రాంచంద్రారెడ్డి, నర్సింగ్ క్రిష్ణయ్యగౌడ్, హాపీజుద్దీన్ బారతవెంకటేశం, డి.వెంకట్‌రెడ్డి, బిక్షంయాదవ్, గోలిజగాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సీపీఐ గ్రామశాఖ కార్యదర్శి మృతి

నార్కట్‌పల్లి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలంలోని పల్లెపహాడ్ సీపీఐ గ్రామశాఖ కార్యదర్శి దార లక్ష్మయ్య గురువారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. లక్ష్మయ్య అకాల మృతికి రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కల్మెకొలను శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. లక్ష్మయ్య మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు నివాళులర్పించిన వారిలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్, మండల కార్యదర్శి పెండ్యాల శంకర్, చిట్యాల మండల కార్యదర్శి ఎండీ అక్బర్, సీనియర్ నాయకులు వెంపటి శ్రీనివాస్, సంగిశెట్టి శ్రీనివాస్, పులుసాని అనంతరెడ్డి, వెంకటయ్య ఉన్నారు.


అక్రమ అరెస్టులపై ఖండన

మర్రిగూడ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని ఝలో అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న ఆటో డ్రైవర్లను పోలీసులను అరెస్టు చేయడం దారుణమని ఏఐఎస్ఎఫ్ అధ్యక్షుడుషు ఇస్కిళ్ల మహేందర్, ఆటోల డ్రైవర్ అధ్యక్షుడు యాదగిరి అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఫ్రీ బస్సులు వేయడం వల్ల ఆటోల డ్రైవర్ల జీవితాలు దుర్భరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

***



నల్లగొండ

3

శనివారం 21 డిసెంబరు 2024

● ఊతం



పందిళ్ల సాగుకు ప్రోత్సాహం

కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా సాగునీటి సౌకర్యం ఉన్న రైతులు పందిళ్ల సాగు చేసేందుకు ఆర్థికంగా చేయూత అందించాలని నిర్ణయించింది. పందిళ్ల సాగు కింద బీర, కాకర, సొర, దొండకాయ, చిక్కుడు, బీన్స్, తదితర కూరగాయలు సాగుచేయవచ్చు. వీటికి టమాట, ఉల్లిగడ్డలా ధరల్లో హెచ్చు తగ్గులు ఉండవు. ఎప్పుడూ నికరంగా ధర ఉంటుంది. దీంతో ఓ వైపు రైతులకు లాభంతోపాటు కూరగాయల కొరత ఏర్పడకుండా చూడాలన్నది ప్రభుత్వ ఉద్దేశం.

- (ఆంధ్రజ్యోతి,యాదాద్రి, నల్లగొండ)

- అర ఎకరాకు రూ.50వేలు ఆర్థిక సాయం
- ఒక్కో రైతుకు రెండున్నర ఎకరాల వరకు అవకాశం
- యాదాద్రి జిల్లాకు 35యూనిట్లకు రూ.17.50లక్షలు మంజూరు
- నల్లగొండ జిల్లాకు 90 యూనిట్లు మంజూరు
- ఉద్యాన పంటల సాగుపై ప్రభుత్వం దృష్టి
- రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

రాష్ట్రంలో కూరగాయల కొరత లేకుండా ఈ పంటల సాగు పెంచేలా ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ప్రస్తుతం మార్కెట్‌లో కూరగాయల ధరలు రోజురోజుకూ రెట్టింపు అవతున్నాయి. దీంతో ప్రజలకు ఆర్థిక భారం పడుతున్నా రైతులకు మాత్రం ప్రయోజనం ఉండటం లేదు. కేవలం వ్యాపారులు మాత్రమే లాభాలు గడిస్తున్నారు. ధరల పెరుగుదలకు స్థానికంగా ఈ పంటలను సాగుచేయకుండా, ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవడమే ప్రధాన కారణమని ప్రభుత్వం గుర్తించింది. వరికి ప్రత్యామ్నాయంగా కూరగాయాలు, పండ్లు, పూల సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. యాదాద్రి జిల్లా హైదరాబాద్‌కు చేరువలో ఉన్నా ఇక్కడ ప్రధానంగా వరి, పత్తి, కంది, తదితర పంటలపైనే రైతులు దృష్టి సారిస్తున్నారు. ఈ ప్రాంత రైతుల దృష్టిని ఉద్యాన పంటల వైపు మళ్లించేందుకు ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. అందులో భాగంగా రైతులు పందిళ్లతో కూరగాయల సాగు చేపట్టేలా అర ఎకరానికి రూ.50 వేల వరకు ఆర్థికంగా సాయం అందించనుంది. ఈ నిధులత పందిళ్లకు రాతి స్తంభాలు(కడీలు), ఇనుప వైర్లు ఏర్పాటు చేసుకోవచ్చు. యాదాద్రి జిల్లాకు మొత్తం 35యూనిట్లకు ప్రభుత్వం రూ.17.50 లక్షలు మంజూరు చేసింది. నల్లగొండ జిల్లాకు 90యూనిట్లు మంజూరుచేసింది.ఒక్కో రైతు 5యూనిట్ల వరకు అంటే రెండున్నర ఎకరాల వరకు పందిళ్ల సాగు చేయవచ్చు. వీటి సాగుకు ముందుకొచ్చే రైతులు దరఖాస్తు చేసుకున్న వెంటనే వారి పంట భూమిని అధికారులు పరిశీలించి అనుమతి ఇచ్చాక ఉద్యానశాఖకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుంది. మరోవైపు ఆయిల్‌పాం సాగును కూడా ఈ ఏడాది 2వేల ఎకరాల వరకు సాగును పెంచేలా అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. యాదాద్రి జిల్లాలో ఇప్పటివరకు 3,500 ఎకరాల్లో ఆయిల్‌పాం సాగవుతోంది. వచ్చే ఏడాది నుంచి ఆయిల్‌పాం గెలల దిగుమతి రానుంది.

250 గ్రామాలు కూరగాయల సాగుకు దూరం

వానాకాలంతో పాటు యాసంగిలో జిల్లాలో మొత్తం 3.50లక్షల ఎకరాల్లో పలు రకాల పంటలు సాగవుతున్నాయి. జిల్లాలో 426 గ్రామపంచాయతీల్లో సుమారు 250 పంచాయతీల్లో అసలు కూరగాయల సాగే లేదు. జిల్లా నేలలు పలు రకాల కూరగాయలు సాగుకు అనుకూలమైనా రైతులు ఆసక్తి చూపడం లేదు. జిల్లా జనాభాకు ఏటా సుమారు 80వేల మెట్రిక్ టన్నుల కూరగాయలు అవసరం. కాగా, జిల్లాలో కేవలం 30వేల మెట్రిక్ టన్నులు కూరగాయలు మాత్రమే ఉత్పత్తి అవుతున్నాయి. ఏటా జిల్లాకు ఇతర ప్రాంతాల నుంచి 50వేల మెట్రిక్ టన్నులకు పైగా కూరగాయలు దిగుమతి..

- మిగతా 4వ పేజీలో...

పందిళ్ల సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు ప్రణాళిక



రైతులు కూరగాయలు సాగు చేసేందుకు అవకాశం ఉన్నప్పటికీ, చాలా గ్రామాల్లో సంప్రదాయ పంటలకే పరిమితమవుతున్నారు. జిల్లాలో పందిళ్ల సాగుపై ఆసక్తి ఉన్న రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. పందిళ్ల సాగు కోసం 35 యూనిట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. రైతులు పొలాల్లో అర ఎకరం వరకు సాగు చేస్తే రూ.50వేలు ఆర్థిక సాయం అందుతుంది. ఆయా మండలాల ప్రజల జనాభాకు అనుగుణంగా కూరగాయలు సాగుచేసేలా రైతులకు అవగాహన కల్పిస్తు న్నాం. కూరగాయల సాగుతో రైతులు ఆర్థికంగా మెరుగుపడతారు. జిల్లా వ్యాప్తంగా కూరగాయలతోపాటు పలు రకాల పండ్ల సాగును కూడా పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలో ఆయిల్‌పామ్ సాగుకు రైతులు ముందుకువస్తున్నారు. వారికి ప్రభుత్వంపరంగా వచ్చే సబ్సిడీలపై అవగాహన కల్పిస్తున్నాం.

- సుభాషిణి, యాదాద్రి జిల్లా ఉద్యానశాఖ అధికారి

● ఘాతం





నూతన మెనూ మాతో కాదు

- ప్రస్తుత ధరలతో సాధ్యంకాని మెనూ
- ఒక్కో విద్యార్థికి కనీసం రోజుకు రూ.100కేటాయించాలని డిమాండ్
- కలెక్టర్లకు వినతిపత్రాలు
- ఉమ్మడి జిల్లాలో 273 సంక్షేమ హాస్టళ్లు

ప్రభుత్వ హాస్టళ్లలో వసతి పొందుతున్న విద్యార్థులకు పోషకాలతో కూడిన నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ప్రభుత్వం భావించింది. అందుకోసం ఇటీవల ప్రభుత్వం నూతన మెనూను ప్రకటించింది. అన్ని ప్రభుత్వ హాస్టళ్లలో ప్రతీ రోజు నూతన మెనూ అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అంతేగాక, సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు నూతన మెనూ అమలును హాస్టళ్లలో అట్టహాసంగా ప్రారంభించి విద్యార్థులతో కలిసి భోజనం చేసి ప్రారంభించారు. అయితే ప్రస్తుత ధరలతో ఈ మెనూ అమలు సాధ్యం కాదని వార్డెన్లు తేల్చి చెబుతున్నారు. దీంతో కొన్ని చోట్ల వార్డెన్లు పాత మెనూనే అమలు చేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి,సూర్యాపేట (కలెక్టరేట్)

ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న ధరలతో నూతన మెనూ అమలు చేయడం సాధ్యకాదని వార్డెన్లు చెబుతుండగా, ప్రభుత్వం నూతన మెనూ ప్రకటించినా, వాటి ధరలు, విద్యార్థులకు ఎన్ని గ్రాములు అందించాలో మాత్రం ప్రకటించలేదు. ఒక్కో విద్యార్థికి ఎన్ని గ్రాముల చికెన్, మటన్ అందించాలో మెనూలో లేదు. అంతేగాక నూతన మెనూ ప్రకారం ప్రతీ రోజు ఆరు నుంచి ఏడు రకాల కూరలు వడ్డించాలి. దీంతో పాటు ఉడకబెట్టిన కోడిగుడ్డు అందించాలి. ఇవన్నీ అమలు చేయాలంటే సాధ్యంకాదని వార్డెన్లు చెబుతున్నారు. మెనూ అమలుకు జిల్లా సంక్షేమాధికారులు ఒత్తిడి తేవడం భావ్యం కాదంటున్నారు. ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి కనీసం రోజుకు రూ.100 కేటాయిస్తేనే ప్రకటించిన మెనూ అమలు చేయడం సాధ్యమవుతుందంటున్నారు. దీంతో వార్డెన్లు ఆయా జిల్లాల కలెక్టర్లకు ఇప్పటికే వినతి పత్రాలు కూడా అందజేశారు. ఈ విషయంలో ప్రభుత్వం స్పందించి స్పష్టత ఇస్తేనే విద్యార్థులకు పోషకాలతో కూడిన నాణ్యమైన ఆహారం అందే అవకాశం ఉంది.

ధరలు, గ్రాముల వివరాలు ప్రకటించాలంటున్న వార్డెన్లు

నూతన మెనూ అమలు చేయాలంటే ముందుగా ఆహార పదార్థాల ధరలు, ఒక్కో విద్యార్థికి ప్రతి రోజు ఆహారంలో అందించాల్సిన కూరలు, వాటి పరిమాణాన్ని ప్రకటించాలంటున్నారు వార్డెన్లు. అప్పుడే విద్యార్థుల సంఖ్యను బట్టి నూతన మెనూ అమలు చేయడం సాధ్యం అవుతుంది. ప్రస్తుతం మూడో తరగతి నుంచి ఏడో తరగతి విద్యార్థులకు నెలకు రూ.1330, 8వ తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు నెలకు రూ.1540, ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్థులకు నెలకు రూ.2100 ప్రభుత్వం డైట్ చార్జీగా ఇస్తోంది. అయితే విద్యార్థులకు రోజూ ఉదయం ఏదో ఒక టిఫిన్, మధ్యాహ్నం అన్నం, పప్పు, సాంబారు మాత్రమే ఇస్తున్నారు. రాత్రి సమయంలో అన్నం, ఏదైనా కాయగూరలతో కూర, మజ్జిగతో పాటు వారంలో ఐదు రోజులు కోడిగుడ్డు అమలు చేస్తున్నారు. కానీ, నూతన మెనూలో రోజుకు ఆరు నుంచి ఏడు రకాల కూరలు వడ్డించాల్సి ఉంది.

ఉమ్మడి జిల్లాలో 273 ప్రభుత్వ హాస్టళ్లు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖలకు చెందిన హాస్టళ్లు మొత్తం 273 ఉన్నాయి. ఈ హాస్టళ్లలో మొత్తం 23వేల మందికి పైగా విద్యార్థులు వసతి పొందుతున్నారు. అందులో సూర్యాపేట జిల్లా పరిధిలో 81 హాస్టళ్లు ఉన్నాయి. ఎస్సీ హాస్టళ్లు 36 ఉండగా, ప్రీమెట్రిక్ హాస్టళ్లు 30, పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లు ఆరు ఉన్నాయి. ఈ హాస్టళ్లలో సుమారు 2,900 మంది విద్యార్థులు వసతి పొందున్నారు. అదే విధంగా బీసీ హాస్టళ్లు 24 ఉన్నాయి. అందులో ప్రీమెట్రిక్ హాస్టళ్లు 15, పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లు 9 ఉన్నాయి. ఈ హాస్టళ్లలో...

- మిగతా 5వ పేజీలో...

రూ.100 కేటాయిస్తేనే

ప్రభుత్వ హాస్టళ్లలోని విద్యార్థులకు ప్రభుత్వం ప్రకటించిన నూతన మెనూ పక్కాగా అమలు చేయాలంటే ఒక్కో విద్యార్థికి రూ.100 కేటాయించాలని వార్డెన్లు పేర్కొంటున్నారు. ప్రస్తుతం నిత్యావసర వస్తువులతోపాటు, కూరగాయల ధరలు భారీగా పెరిగాయి. దీంతో ధరలను దృష్టిలో పెట్టుకుని మెనూ సిద్ధం చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం నూతన మెనూ ప్రకటించక ముందే ఆయా సంక్షేమశాఖల కమిషనర్లు కొత్త మెనూ సిద్ధం చేశారు. దాన్ని అమలు చేయాలంటేనే ఇబ్బందులు పడుతున్నామని, నూతన మెనూ మరింత ఇబ్బందికరంగా ఉందని వార్డెన్లు వాపోతున్నారు.

ఆసుపత్రి పనులు త్వరగా ప్రారంభించాలి

కలెక్టర్ ఇలాత్రిపాఠి



ఆసుపత్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి

నల్లగొండ టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో చేపట్టనున్న కొత్త బ్లాక్ నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిని ఆమె తనిఖీచేసి నూతన బ్లాక్‌ల నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వ మెడికల్ కళాశాల ఇటీవల నూతన భవనంలోకి మారగా, గతంలో నిర్వహించిన ఓపీ బ్లాక్‌ను పూర్తిగా తీసివేసి, ఇక్కడ నూతన భవనం నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.32కోట్లు విడుదల చేసిందన్నారు. అందులో భాగంగా తక్షణమే మెడికల్ కళాశాల సామగ్రిని నూతన భవనానికి తరలించాలని, నూతన బ్లాక్ కోసం గోడను నిర్మించి రోగులకు ఇబ్బంది కలగకుండా పనులు ప్రారంభించాలని సూచించారు. అలాగే నిర్మాణంలో ఉన్న క్రిటికల్ కేర్ విభాగాన్ని రెండు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఆమె వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణకుమారి, టీఎస్ఎంఐడీసీ ఈఈ జైపాల్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

సర్వే సిబ్బందికి అందుబాటులో ఉండాలి

ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు దరఖాస్తు చేసుకున్న వారు సర్వే బృందాలు వచ్చినప్పుడు అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. ఈ నెల 31 వరకు ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల సర్వే ఉంటుందన్నారు. ప్రతీ దరఖాస్తుదారు సర్వే బృందాలకు అందుబాటులో ఉండి వారి ఫొటో సహా ఇంటికి సంబంధించిన డాక్యుమెంట్లు, ఇతర వివరాలు సమర్పించాలన్నారు. ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినవారు ఉంటే వాట్సప్ ద్వారా కూడా సమాచారాన్ని అందజేయవచ్చన్నారు. సిబ్బంది యాప్‌లో వివరాలను జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు. దేవరకొండ, మిర్యాలగూడ, చండూరు తదితర డివిజన్‌లో సర్వే నెమ్మదించిందని, వెంటనే వేగవంతం చేయాలన్నారు. సర్వే పూర్తయ్యేంతవరకు పంచాయతీ కార్యదర్శులకు ఎలాంటి సెలవు మంజూరు చేయవద్దన్నారు. అనారోగ్య సమస్య ఉంటే ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ నారాయణ్‌అమిత్, ఆర్డీవోలు రమణారెడ్డి, శ్రీదేవి, గృహనిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను పరిష్కరించాలి

ఎస్పీ శరత్‌చంద్ర పవార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ కేసులు లేకుండా సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన నేర సమీక్షలో ఆయన మాట్లాడారు. పెండింగ్ కేసులను పూర్తి పారదర్శకంగా విచారించాలన్నారు. కేసు నమోదు నుంచి చార్జిషీట్ వరకు ప్రతీ విషయాన్ని కూలంకుషంగా విచారించాలన్నారు. పోక్సో కేసుల్లో త్వరితగతిన విచారన పూర్తిచేసి చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. అవసరమైతే సంబంధిత న్యాయమూర్తులను కలిసి కేసుల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. కొత్త కేసులతో పా టు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను ఎప్పటికప్పుడు సమీక్షించి వా టి సంఖ్య తగ్గే దిశగా అన్ని స్థాయిల అధికారులు పని చేయాలన్నారు. సాంకేతి క పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉండి సమర్థవంతమైన సేవలు అందించాలన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. సైబర్ క్రైం, డయల్ 100, ట్రాఫిక్ ని బంధనలు, తదితర విషయాలపై విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. విజుబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి రోజూ డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించాలన్నారు. గంజాయి, పీడీఎస్ బియ్యం రవాణాతోపాటు చట్టవ్యతిరేక కార్యకలాపాలపై దృష్టిపెట్టి వాటిని అరికట్టేందుకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీ రాములునాయక్, డీఎస్పీలు, సీఐలు, తదితరులు పాల్గొన్నారు.

సోలార్ బ్యాటరీలతో ఆదాయం

- మహిళలు సద్వినియోగం చేసుకోవాలి
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



సహాయక సంఘాల మహిళలకు చెక్కు పంపిణీ చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కలెక్టర్ ఇలాత్రిపాఠి, చిత్రంలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్


నల్లగొండ టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మొదటి సారిగా పైలట్ ప్రాజెక్టుగా మహిళా సంఘాలకు సోలార్ బ్యాటరీలు అందజేస్తున్నామని, దీంతో ఆదాయం కలుగుతుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కట్టంగూరు మండలం అయిటిపాముల గ్రామానికి చెందిన 50 మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా సోలార్ బ్యాటరీల ఏర్పాటుకు రూ.50లక్షల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మహిళలకు ఇందిరా మహిళ స్వశక్తి కింద ఒక్కొక్కరికి రూ.లక్ష విలువ చేసే సోలార్ బ్యాటరీలు 50మందికి అందజేస్తున్నామన్నారు. భూమి లేని నిరుపేద కుటుంబాలకు తోడుగా ఉండేందుకు నెలకు రూ.3వేల నుంచి రూ.4వేల వరక ఆదాయం వచ్చేలా స్వబ్యాగ్స్ ల్యాబ్ సహకారంతో సోలార్ బ్యాటరీ ఎనర్జీ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా ఇలాంటి కార్యక్రమాన్ని జిల్లాలో చేపట్టామన్నారు. మహిళలు సోలార్ బ్యాటరీల కోసం అదనపు పని చేయాల్సిన అవసరం లేదని, వారి పని వారు చూసుకుంటూనే ఆదాయం పొందవచ్చని తెలిపారు. స్వబ్యాగ్స్ ల్యాబ్ ఈ బ్యాటరీలను మహిళల ఇంటి దగ్గరి చేరుస్తుందని, బ్యాటరీ చార్జింగ్ కంపెనీ అనంతరం ప్రతినిధులు వచ్చి తీసుకువెళ్తారని, ఒక యూనిట్ పవర్‌కు రూ.16 కంపెనీ చెల్లిస్తుందన్నారు. పైలట్ పద్ధతిన ప్రారంభించిన ఈ ప్రాజెక్టు విజయవంతమైతే రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో కూడా అమలుచేస్తామన్నారు. కలెక్టర్ ఇలాత్రిపాఠీ మాట్లాడుతూ, ఇప్పటి వరకు తెలంగాణలో ఏ జిల్లాలో లేని విధంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామని, ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50 మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు సోలార్ ఎనర్జీ బ్యాటరీలు ఇస్తున్నామన్నారు. ఒక బ్యాటరీకి 2,000 లైఫ్ సైకిల్స్ ఉంటాయని, ఒకసారి బ్యాటరీని 2,000 సార్లు చార్జింగ్ చేసుకోవచ్చన్నారు. అందుకు సరిపడా పరికరాలను స్వబ్యాగ్స్ ల్యాబ్ కంపెనీ అందజేస్తుందన్నారు. ఈ ప్రాజెక్టు నిర్వహణకు సహకరించేందుకు జిల్లా యంత్రాంగం తరపున జిల్లా పరిశ్రమలశాఖ మేనేజర్‌ను, వ్యవసాయశాఖ జేడీఏను నోడల్ అధికారులుగా నియమించినట్లు తెలిపారు. స్వబ్యాగ్స్ ల్యాబ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సీఈవో సుధాకర్ మాట్లాడుతూ, రైతులకు, గ్రామీణ ప్రాంత మహిళలకు సేవలందించేందుకు 2021లో స్వబ్యాగ్స్ ల్యాబ్ స్టారప్ ఏర్పాటు చేశామని, ప్రతీక్ ఫౌండేషన్ సహకారంతో మహిళలతో సోలార్ బ్యాటరీ రెన్యువబుల్ ఎనర్జీని యూనిట్లు ఏర్పాటుచేస్తున్నామన్నారు. సత్య సోలార్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ జక్కుల సత్యనారాయణ మాట్లాడుతూ సోలార్ ఎనర్జీకి చాలా భవిష్యత్తు ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్, జిల్లా పరిశ్రమల మేనేజర్ కోటేశ్వర్‌రావు, హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, ఆర్డీవో అశోక్‌రెడ్డి, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మార్చిలోగా కాల్వల పనులు పూర్తి చేయాలి

ఉదయసముద్రం-బ్రాహ్మణవెల్లెంల ఎత్తిపోతల పథకం కాల్వల పనులు మార్చిలోగా పూర్తిచేసి చెరువలన్నింటినీ నీటితో నింపి 50వేల ఎకరాలకు సాగునీరు అందించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ ఇలాత్రిపాఠితో కలిసి ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కాల్వ పనులకు సంబంధించిన భూసేకరణకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రూ.37కోట్లు మంజూరు చేసిందన్నారు. మరో రూ.35కోట్లు వారం రోజుల్లో విడుదల చేయనుందని, అధికారులు కాల్వ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో అశోక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసిన మంత్రి

కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ఎన్జీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో మంత్రి కోమటిరెడ్డి స్వయంగా రక్తదానం చేశారు. ఆయనతోపాటు పలువురు యువకులు ఉత్సాహంగా ముందుకువచ్చి రక్తదానం చేశారు. అదేవిధంగా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు కాంగ్రెస్ నాయకులు పండ్లు పంపిణీ చేశారు.



రక్తదానం చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ స్పోర్ట్స్): క్రీడల అభివృదికి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎన్జీ కళాశాల మైదానంలో ఎన్‌పీఎల్ క్రికెట్ మ్యాచ్ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 20 రోజులుగా ప్రతీక్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్‌పీఎల్ క్రికెట్ మ్యాచ్ నిర్వహించామన్నారు. విద్యార్థులు, యువకులు క్రీడలపై ఆసక్తి పెంచుకొని ఆటల్లో రాణిస్తే భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఇలాత్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

కేటీఆర్‌పై కేసు కాంగ్రెస్ కుట్ర

బీఆర్ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి రావుల శ్రీధర్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి, పాల్గొన్న కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కేటీఆర్‌ను జైలులో పెట్టడమే టార్గెట్‌గా ఏడాది కాలంగా ము ఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుట్రలు చేస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి రావుల శ్రీధర్‌రెడ్డి విమర్శించారు. శుక్రవా రం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డితో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రతీ నిత్యం కేటీఆర్ ను అరెస్టు చేస్తామని, జైలులో పెడతామని బెదిరిస్తున్నారన్నారు. ఏడాది కాలంగా ప్రశ్నించే ప్రతి నాయకుడిపై, సోషల్ మీడియా ప్రతినిధులపై కేసులు పెట్టడమే సీఎం పనిగా ఉందన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని ప్రభుత్వంపై కేటీఆర్ పోరాడుతుండటాన్ని సీఎం సహించలేక పోతున్నారన్నారు. సాంకేతికంగా ప్రభుత్వం కేసులు పెట్టినా, విషయాన్ని మాత్రం ప్రజలు గమనిస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. రూ.55కోట్లతో కేటీఆర్ ప్రత్యేక చొరవ తీసుకొని ఫార్ములా రేసును రాష్ట్రానికి తీసుకువచ్చారని, ఇందులో కేంద్ర మంత్రులంతా పాల్గొన్నారన్నారు. దీనిపై రేవంత్ సర్కార్ తప్పుడు ప్రచారం చేస్తోందని, అవినీతి అంటూ గగ్గోలు పెడుతోందన్నారు. కాంగ్రెస్ ఎన్ని ఇబ్బందులు పెట్టినా ప్రజల కోసం బీఆర్ఎస్ పోరాటం ఆగదన్నారు. సమావేశంలో నాయకులు రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, కటికం సత్తయ్యగౌడ్, నిరంజన్‌వలీ, మాలే శరణ్యరెడ్డి, కొండూరు సత్యనారాయణ, బోనగిరి దేవేందర్, దేప వెంకట్‌రెడ్డి, అయితగోని యాదయ్య, మారగోని గణేష్, తుమ్మల లింగస్వామి, రావుల శ్రీనివాస్‌రెడ్డి, పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిలదీసినందుకే కేసు

(ఆంధ్రజ్యోతి, దేవరకొండ): ప్రజా సమస్యలపై నిలదీసినందుకే మాజీ మంత్రి కేటీఆర్‌పై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. శుక్రవారం దేవరకొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలపై నిలదీసినందుకు కేటీఆర్‌పై చిల్లర కేసులు పెడుతోందని విమర్శించారు. సమావేశంలో నాయకులు గాజుల ఆంజనేయులు, టీపీఎస్.రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, వేముల రాజు, లోహిత్‌రెడ్డి, జానీబాబ, బొడ్డుపల్లి కృష్ణ, గుండాల వెంకట్, పాల్గొన్నారు.

రోడ్డుపైనే వాహనాలు



వెంకటేశ్వరనగర్ పాత బస్టాండ్ సమీపంలో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు, ఆటోలు

» వ్యాపార సముదాయాల వద్ద పార్కింగ్ కరువు
» మాల్‌లో తీవ్రమవుతున్న ట్రాఫిక్ సమస్య

చింతపల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడుకొండ్ల గ్రామపంచాయతీలోని వెంకటేశ్వరనగర్‌లో రోజు రోజుకు ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. వివిధ అవసరాల నిమిత్తం ప్రజలు, విద్యార్థులు, యువత వివిధ వర్గాల ప్రజలు వెంకటేశ్వరనగర్(మాల్)కు వస్తుండటంతో వాహనాల రద్దీ పెరుగుతోంది. మాల్‌లో షాపింగ్ కాంప్లెక్స్‌లు, ఆసుపత్రులు, హోటళ్లు, ఇతర వ్యాపార సముదాయాలు విపరీతంగా పెరగడంతో పాటు క్రయ విక్రయాలు సైతం పెద్ద ఎత్తున పెరిగాయి. దీంతో వ్యాపార సముదాయాలకు వెళ్లే వినియోగదారులు వాహనాలను పట్టణంలో పార్కింగ్ స్థలం లేకపోవడంతో రహదారిపైనే నిలుపుతుండటంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. మాల్‌లో ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా పోలీస్‌శాఖ ఇటీవల వ్యాపారులకు అవగాహన కల్పించారు. నిర్వాహకులు కొంతమేరకు నిబంధనలు పాటించినా మంగళవారం చిరు వ్యాపారులు రోడ్డుపైనే ఏర్పాటు చేసుకొని విక్రయిస్తున్నారు.

జిల్లా సరిహద్దు ప్రాంతంలో రద్దీ

నల్లగొండ - రంగారెడ్డి జిల్లా సరిహద్దు ప్రాంతమైన వెంకటేశ్వరనగర్ ఎక్స్ రోడ్డు సమీపంలో వాహనాలతో పాటు, చిరువ్యాపారులు రోడ్డుపైనే నిర్వహిస్తుడటంతో కొంతమేరకు ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. రంగారెడ్డి, నల్లగొండ జిల్లా పోలీసులకు ఇబ్బందిగా మారుతుంది. చింతపల్లి, యాచారం, మర్రిగూడ, నాంపల్లి మండలాల నుంచి ప్రజలు, విద్యార్థులు తమ అవసరాల నిమిత్తం పట్టణానికి వస్తున్నారు.

పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలి



పట్టణంలో వినియోగదారుల కోసం షాపింగ్ దుకాణాల వద్ద పార్కింగ్ స్థలం లేకపోవడంతో రోడ్డుపైనే వాహనాలు నిలుపుతున్నారు. అధికారులు చొరవ తీసుకొని పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలి.

- లక్ష్మణ్ సాగర్, వెంకటేశ్వరనగర్

నిబంధనలు పాటించాలి



రోడ్డుపైనే వ్యాపారాలు సాగించడం వల్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. వాహనాలను పార్కింగ్ ప్రాంతంలోనే నిలుపుకోవాలి. వ్యాపారస్తులు నిబంధనలు పాటిస్తే పట్టణంలో ట్రాఫిక్‌కు చెక్‌పెట్టే అవకాశం ఉంటుంది. లేనిచో జరిమానా విధించేందుకు తగిన చర్యలు తీసుకుంటాం.

- యాదయ్య, ఎస్ఐ, చింతపల్లి

రూ.20 లక్షల ప్రమాద బీమా చెక్కు అందజేత

పెద్దఅడిశర్లపల్లి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు మృతి చెందిన ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఖాతాదారుడి కుటుంబ సభ్యులకు రూ.20 లక్షల చెక్కును జిల్లా రీజనల్ మేనేజర్ విజయ్‌భాస్కర్‌గౌడ్ శుక్రవారం అందజేశారు. గుడిపల్లి మండలంలోని మాధపురం గ్రామానికి చెందిన రమావత్ శ్రీధర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడు అంగడిపేట ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ ద్వారా మంజూరైన రూ.20లక్షల చెక్కును మృతిని భార్య రమావత్ సునీతకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్క ఖాతాదారుడు ప్రమాదబీమా ఇన్సూరెన్స్ చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో అంగడిపేట బ్రాంచ్ మేనేజర్ షేక్ శంషిమ్, ఫీల్డ్ అసిస్టెంట్ ఆనంద్, కృష్ణయాదవ్, మల్లిఖార్జున్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమతత్వమే క్రీస్తు సందేశం

పెద్దఅడిశర్లపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రేమ తత్వమే క్రీస్తు సందేశమని ప్రపంచ శాంతికి క్రీస్తు బోధనలే మార్గదర్శకమని డాక్టర్ కోనేరు ప్రభుప్రసాద్ అన్నారు. మండలంలోని అంగడిపేట ఎక్స్‌రోడ్డు గ్రామ పంచాయతీ ఆవరణలో పాస్టర్ కాశిప్రభు ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. వ్యాఖ్య సందేశమిచ్చి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కొవ్వొత్తులు వెలిగించి క్రీస్తు జననాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పాస్టర్ దయాపతి, పాస్టర్ కిస్తఫర్, ప్రభాకర్, పెద్దులు, సాలయ్య, అచ్యుత్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న పాస్టర్ల బృందం

పెన్షనర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలి



రిటైర్డ్ ఉద్యోగులను సన్మానిస్తున్న వెంకట్‌రెడ్డి

దేవరకొండ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్‌రెడ్డి, శ్రీశైలం అన్నారు. అఖిల భారత పెన్షనర్స్ డేను పురస్కరించుకొని దేవరకొండలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం విశాంత్ర ఉగ్యోగుల సంఘం నాయకులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో దేవరకొండ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు తాటిశెట్టి నరసింహ, అంకం చంద్రమౌళి, నారాయణరెడ్డి, షరీఫ్, సత్యంమూర్తి, బుచ్చయ్య పాల్గొన్నారు.

బస్సులను పునరుద్ధరించాలి



డీఎంకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

అడవిదేవులపల్లి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలానికి సరిపడా బస్సులు రాకపోవడంతో తాము ఇబ్బందులు పడుతున్నామని అడవిదేవులపల్లి గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. మిర్యాలగూడ ఆర్టీసీ బస్ డిపో మేనేజర్ రామ్మోహన్‌రెడ్డికి శుక్రవారం పలువురు గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో రోజూ నాలుగు బస్సులు వచ్చేవని, మండల కేంద్రం ఏర్పడిన నాటి నుంచి కేవలం ఒక్క బస్సు మాత్రమే వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, బస్సు సౌకర్యం లేక విద్యార్థులు తమ చదువులను మధ్యలోనే నిలిపివేస్తున్నారని అన్నారు. అధికారులు స్పందించి తిరిగి బస్సు సర్వీసులను పునరుద్ధరించి ప్రయాణికుల ఇబ్బందులను తొలగించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎస్.సైదయ్య, రామాంజి, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వెంకటేశ్వరస్వామి కల్యాణం

చింతపల్లి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోదుగులమల్లేపల్లిలోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయలో ధనుర్మాసం సందర్భంగా శుక్రవారం నిర్వాహకులు పద్మావతీ సమేత శ్రీనివాసుని కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, కల్యాణం అంత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు కేఎల్.నరసింహం, శైలజ, అశ్విన్ సింహ, ప్రియాంక, అర్చకులు వైద్యుల రవీంద్రనాథ్‌శర్మ, ప్రవీణ్‌కుమార్‌శర్మ, గాదేభట్ల సోమనారాయణశర్మ, రాజు, క్రాంతిరెడ్డి, గిరి, రాములు పాల్గొన్నారు.

కేజీబీవీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి



కేజీబీవీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థినులు

అడవిదేవులపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలంటూ సమగ్ర ఉపాధ్యాయులు సమ్మె చేస్తుండటంతో కేజీబీవీ విద్యార్థినులకు తరగుతులు జరగక ఇబ్బందులు పడుతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర సైదానాయక్ అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ శుక్రవారం నిర్వహించిన ఆందోళనలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మెకు దిగడంతో విద్యార్థినులకు విద్యాబోధన జరగక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పది, ఇంటర్ పరీక్షలు దగ్గర పడుతుండటంతో విద్యార్థినులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజు, శ్రీను, రవి, కిరణ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



కేజీబీవీ అధికారులకు సూచనలు ఇస్తున్న డీపీవో వెంకటేశ్వర్లు

గుర్రంపోడు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెసిడెన్షియల్ పాఠశాలల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా పౌరసరఫరాల అధికారి, మండల ప్రత్యేక అధికారి వి.వెంకటేశ్వర్లు అన్నారు. మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాల చుట్టూ చెట్లు, పొదలు లేకుండా శుభ్రం చేయించాలని పాఠశాల ప్రత్యేకాధికారికి సూచించారు. పాఠశాలలోకి ఎలుకలు, పాములు ప్రవేశించకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం పాఠశాలలోని బియ్యాన్ని, అన్నం, కూరలను పరిశీలించారు. గుర్రంపోడు, ముల్కలపల్లి, పోచంపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. ఇళ్ల సర్వేను వేగవంతం చేయాలని ఆయన సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో మంజుల, ఆర్ఐసీఎస్ సైదులుగౌడ్ ఉన్నారు.

అమిత్‌షా బహిరంగ క్షమాపణలు చెప్పాలి

వేములపల్లి, నాంపల్లి, దేవరకొండ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను పార్లమెంట్ సాక్షిగా అవమానించిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు పఠాని శ్రీను, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పుట్ట సంపత్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వారు నల్లజెండాలతో నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. దేశ ప్రజలు జీవించడానికి కావాల్సిన స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం వంటి అనేక ప్రజాస్వామ్య విలువలు అందించిన మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు. అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్‌షా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధని, మండల నాయకులు వడ్డెగాని సైదులు, రెమడాల భిక్షం, మురళి, సోమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.



దేవరకొండ: నల్లా బ్యానర్‌తో నిరసన తెలుపుతున్న సీఐటీయూ, ప్రజా సంఘాల నేతలు

● నాంపల్లిలో ధర్మ సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు ఇరిగి సుధాకర్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి వారు పూలు, పాలతో అభిషేకాలు చేసి అనంతరం నిరసన వ్యక్తం చేశారు. అమిత్ షా వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్, ప్రశాంత్, శివన్, యాదగిరి, అంజి, రఘు, మహేష్, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

● దేవరకొండలో సీఐటీయూ, సీపీఎం ఎస్ఎఫ్ఐ, ఐద్వా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నపాక లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు, డీజిల్ లింగయ్య, ముడిగ వెంకటేష్, శ్రీను, జ్యోతి, భద్రమ్మ, శంకరయ్య, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

మిర్యాలగూడ, నిడమనూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర విద్య వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి మోర్తాల శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కోడిరెక్క జయరాజు కోరారు. శుక్రవారం రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను వారు ఆవిష్కరించి మాట్లాడారు. డిసెంబరు 28, 29, 30 తేదీల్లో నల్లగొండ పట్టణంలోని లక్ష్మీ గార్డెన్‌లో జరిగే రాష్ట్ర మహాసభల్లో భారత ఆర్థిక వ్యవస్థలో మధ్య తరగతి ప్రజలకు జరిగే ప్రయోజనమేమిటి? అనే అంశంపై ప్రొఫెసర్ నాగేశ్వరావు, విద్యలో రాజ్యాంగ విలువలపై ఆంధ్రజ్యోతి పూర్వ సంపాదకులు కె.శ్రీనివాస్, జాతీయ విద్యావిధానం- ప్రభుత్వ విద్యపై ప్రభావంపై కుమారి ఆయుష్ గోష్ ప్రసంగించనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బకల్వాడ హైస్కూల్ హెచ్‌ఎం ఎ.కరుణాకర్‌రెడ్డి, యూటీఎఫ్ నాయకులు ఎండి. సాజీద్, అలీ, శివ, నెహ్రూ, శ్రీనివాస్, మాధవి, శైలజ, అజ్మత్ అలీ, జియావుద్దీన్, వెంకటయ్య, సైదులు, దయాకర్‌రెడ్డి, గిరిజ పాల్గొన్నారు.



మిర్యాలడూడలో యూటీఎఫ్ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

● నిడమనూరు మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో మహాసభల పోస్టర్లను టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కొమరాజు సైదులు, ఎంఈవో వెంకన్న, కాంప్లెక్స్ హెచ్‌మాస్టర్ గౌతమ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడంతో పాటు సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎ ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం నాయకులు లింగంపల్లి అంజయ్య, బొమ్ము ఉపేందర్, ఝాన్సీ, యాదగిరిరెడ్డి, ప్రతాప్, మాధవి, వెంకన్న, శ్రీనివాస్‌రెడ్డి, జ్యోతి, విజయలక్ష్మి, మోతీలాల్ పాల్గొన్నారు.

గురుకులాలకు రెగ్యులర్ వార్డెన్లను నియమించాలి

మిర్యాలగూడ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గురుకులాలకు రెగ్యులర్ వార్డెన్లను నియమించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రవినాయక్ కోరారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో వివిధ గురుకులాల్లో సర్వే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం విద్యార్థులకు క్లాసులు బోధించే టీచర్లనే వార్డెన్లుగా నియమించడం వల్ల గురుకుల విద్యార్థులకు నష్టం వాటిల్లుతోందని అన్నారు. చలికాలంలో ఉదయం 8 గంటలకే పాఠశాలకు వెళ్లడం సాధ్యం కావడం లేదని పేర్కొన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పెంచిన మెస్ చార్జీలతో ప్రభుత్వం నిర్దిష్టమైన మెనూను ప్రకటించాలని కోరారు. గురుకులాల్లో స్కావెంజర్లు లేక శుభ్రత కరువైందన్నారు. ప్రభుత్వం తక్షణమే స్కావెంజర్లను నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు జగన్, సైదానాయక్, దామరచర్ల మండల కార్యదర్శి వీరన్న, ఎస్ఎఫ్ఐ నాయకులు న్యూమాన్, ప్రసన్న, కవిత తదితరులు పాల్గొన్నారు.



గురుకులాల్లో సర్వే చేస్తున్న ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు

అంగన్వాడీలో అన్నప్రాశన

చింతపల్లి,డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): చింతపల్లి మండల కేంద్రంలోని 5వ అంగన్‌వాడీ కేంద్రంలో కేంద్రంలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చిన్నారులకు అన్నప్రాశన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ పార్వతి మాట్లాడుతూ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పోషక పదార్థాలను అందించాలని అన్నారు. కార్యక్రమంలో టీచర్ ఆర్.పద్మ, ఆయా హసీనా పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

మిర్యాలగూడటౌన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని ఎంఈవో బాలునాయక్ విద్యార్థులకు సూచించారు. పట్టణంలోని కేజీబీవీ, గురుకుల పాఠశాలలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో సమయం వృధా చేయకుండా చదువుకోవాలన్నారు. ఇష్టంతో చదివితే ఉత్తమ ర్యాంకులు సాధించవచ్చని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు.

జెండా ఊడింది..స్తంభం మిగిలింది

నాగార్జునసాగర్, డిసెంబరు20 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్ జలాశయం మధ్యలో ఉన్న నాగార్జునకొండపై జాతీయ సమైక్యత భావాన్ని, దేశ ఔన్నత్యాన్ని పర్యాటకులకు తెలియజేయాలనే ఉద్దేశ్యంతో ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15వ తేదీన 100 అడుగులు ఎత్తులో జాతీయ జెండాను ఎగురవేశారు. జెండా ఎగురవేసిన నాలుగు నెలలకే పోల్ పై నుంచి జెండా ఊడిపోయింది. ప్రస్తుతం ఉత్త స్తంభమే దర్శనమిస్తుంది. ఈ విషయంపై నాగార్జునకొండ అధికారులను వివరణ కోరగా జాతీయజెండాలో ఆకుపచ్చ రంగు వద్ద చిరిగిపోవడంతో కుట్టించడానికి తీశామని, త్వరలో మరల జాతీయజెండాను నాగార్జునకొండపై ఎగురవేస్తామని తెలిపారు.



జాతీయ జెండా లేకుండా దర్శనమిస్తున్న స్తంభం (ఇన్‌సెట్‌లో) జాతీయజెండా

బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేయాలి

గుర్రంపోడు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. మండలానికి చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పాశం గోపాల్‌రెడ్డి శుక్రవారం ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా రవీంద్రకుమార్‌ను గోపాల్‌రెడ్డి శాలువాతో సన్మానించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని అన్నారు. ఆయన వెంట మారం గోపాల్‌రెడ్డి, మేకల రఘుపతిరెడ్డి ఉన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలి

వేములపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త కృషి చేయాలని బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పెదమాం భరత్ అన్నారు. మండలంలోని శెట్టిపాలెం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన అన్నారు. అనంతరం గ్రామ బూత్ అధ్యక్షుడిగా కోడిరెక్క రవి, ఇతర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెద మాం వెంకన్న, ఆలకుంట్ల మహేష్, నాగరాజు, ఈట మహేష్, ప్రసాద్, నరేష్, లవయ్య, వెంకటేశ్వర్లు, మహేష్, సతీష్, నాగరాజు, మధు, కల్యాణ్, లింగయ్య పాల్గొన్నారు.

త్వరితగతిన పనులు పూర్తి చేయాలి

మిర్యాలగూడ టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ప్రజారోగ్య శాఖ ఎస్ఈ కందుకూరు వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో భూగర్భ డ్రైనేజీ పనులు వేగవంతం చేయాలని, పైప్‌లైన్లను అనుసంధానం చేయాలన్నారు. నూతనంగా చేపట్టిన ట్యాంకుల నిర్మాణ పనులను చేపట్టాలని ఆదేశించారు. ఆయన వెంట అధికారులు సత్యనారాయణ, వెంకన్న, సాయితేజ, మనోహర్, నరేందర్ ఉన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠినచర్యలు

మిర్యాలగూడ రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు చేపట్టినా, వారికి సహకరించినా కఠినచర్యలు తప్పవని తహసీల్దార్ హరిబాబు పేర్కొన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో పోలీసు అధికారులతో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

పట్టణంలోని 626, మల్లెలతోట ఆక్రమణలపై కలెక్టర్, సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు తగిన చర్యలు చేపట్టి హెచ్చరిక బోర్డులు, ఫెన్సింగ్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

ఆటోడ్రైవర్లను ఆదుకోవడంలో విఫలం

వేములపల్లి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): సరైన ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్న ఆటో డ్రైవర్లకు ఉపాధి కల్పించి ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కట్టా మల్లేష్ గౌడ్ అన్నారు. మండలంలోని శెట్టిపాలెం గ్రామంలో శుక్రవారం ఆయన ఆటో డ్రైవర్లతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల ముందు అమలుకాని హామీలను ఇచ్చి అధికారం చేపట్టిన వెంటనే వాటిని అమలుచేయకుండా ప్రజలను మోసం చేస్తుందని అన్నారు. ఆటోడ్రైవర్ల సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేస్తూ అసెంబ్లీలో వాయిదా తీర్మానాన్ని ఇస్తే ఆ తీర్మానాన్ని స్పీకర్ తిరస్కరించడం ఎంతవరకు సమంజసమన్నారు. ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఏటా రూ.12వేల భృతిని అందించి ఆటో సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆటో సంఘం అధ్యక్షుడు ఎస్‌కె.అయూబ్, నాయకులు నక్క శ్రీధర్, కాట్రగడ్డ గోపాల్‌రావు, మట్టయ్య, రామస్వామి, దుర్గారావు, అశోక్, మౌలాలి, లతీఫ్, వీరస్వామి, రవి, జావిద్, వెంకన్న, శేషు, సాయి, నాగరాజు, సైదులు, మహమూద్, నజీర్ పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ల ముందస్తు అరెస్ట్

దేవరకొండ: ఆటో యూనియన్ రాష్ట్ర కమిటీ చలో అసెంబ్లీ ముట్టడికి పిలుపు ఇవ్వడంతో శుక్రవారం దేవరకొండలో ఆటో యూనియన్ నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ నియోజకవర్గ అధ్యక్షుడు జానీబాబా మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు నెలకు రూ.15 వేల జీవనభృతి ఇవ్వాలని, భరోసా పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకుండా అక్రమంగా అరెస్టులు చేయడం సరైన విధానం కాదన్నారు. అరెస్టు అయిన వారిలో ఆటో యూనియన్ నాయకులు తూట్‌పల్లి నగేష్, సుదర్శన్, అఖిల్, గౌస్, గోపి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



వేములపల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న ఆటోడ్రైవర్లు

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలి

దామరచర్ల, మాడ్గులపల్లి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): అర్హులైన రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ వెంటనే అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు డబ్బీకార్ మల్లేష్ అన్నారు. శుక్రవారం తహసీల్దార్ జవహర్‌లాల్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని అన్నారు. వానాకాలం, యాసంగిలకు కలిపి ప్రభుత్వం రైతు భరోసా నిధులను విడుదల చేయాలని కోరారు. రైతు భరోసా నిధులు విడుదల కాకపోవడంతో రైతులు ప్రైవేట్ వడ్డీలకు తీసుకొచ్చి వ్యవసాయం చేసుకుంటుండటంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు. ప్రభుత్వం నియోజకవర్గానికి పది వేల ఇళ్లను కేటాయించాలన్నారు. ప్రభుత్వం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు వెంకటేశ్వర్లు, ఎర్రనాయక్, కోటిరెడ్డి, చంద్రకళ, పాపానాయక్, దయానంద్, ఖాజా మోహిద్దీన్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, వినోద్‌నాయక్, సుబాని, కాంతారావు, విజయ్, మట్టారెడ్డి, శాంతమ్మ పాల్గొన్నారు.



దామరచర్ల: వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

● మాడ్గులపల్లిలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు దేవిరెడ్డి అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నగిరె కృష్ణయ్య, భూపతిరెడ్డి, సీతారాంరెడ్డి, కట్ట సతీష్‌రెడ్డి, కట్ట సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.